



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 139 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 31 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 139 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 31 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్

- తన వద్ద రూ.2 లక్షలు, భార్య వద్ద రూ.1 లక్ష నగదు రూపంలో ఉన్నట్లు వెల్లడి
- బీఎండబ్ల్యూ, టయోటా కార్లు ఉన్నట్లు తెలిపిన విజయ్
- రూ.1.20 కోట్ల విలువైన బంగారం ఉందని పేర్కొన్న విజయ్

- మిగతా2లో




## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవ్వు, రికార్డు చేయవ్వు

- వస్తువులను చూడటం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన అవుతుందన్న మంత్రి
- లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు వెల్లడి
- లాకర్లలోని వస్తువులను విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం కుదరదని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:వినియోగదారులు లాకర్లలో ఉంచే విలువైన వస్తువులను బ్యాంకులు చూడలేవని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వాటిని చూడటం లేదా రికార్డు చేయడం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. బ్యాంకు లాకర్లలో

- మిగతా2లో



## కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారింది



- సన్నకారు రైతులను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందన్న పేర్ని నాని
- బోరు వేయాలన్నా రూ. 50 వేలు వసూలు చేస్తున్నారని ఆరోపణ
- బాధితుల పక్షాన పోరాడతామని వ్యాఖ్య


పెన్ పవర్ డెస్క్:బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సన్నకారు రైతులను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందని

- మిగతా2లో

## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

- తిరుమలలో కాస్త తగ్గిన భక్తుల తాకిడి
- శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం
- 10 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న 80,774 మంది
- రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

- మిగతా2లో




## పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- టీడీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్
- సోషల్ మీడియా ద్వారా స్పందించిన చంద్రబాబు
- కూటమి ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్న సీఎం
- గత 20 నెలల పాలనే మన ఐక్యతకు నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ఐక్యతా స్ఫూర్తి పదికాలాలు కొనసాగాలని ఆకాంక్ష



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ., "రాష్ట్ర అభివృద్ధి,

- మిగతా2లో



## తిరుపతిలో వెయ్యి కోట్ల భూదందా..

### సూత్రధారి, పాత్రధారి నారా లోకేశ్

- తిరుపతి నడిబొడ్డున ఉన్న 22 ఎకరాల భూమిని రూ. 94 కోట్లకే అప్పగించారన్న భూమన
- బహిరంగ ప్రకటన కూడా లేకుండానే భూమిని దోచిపెట్టారని మండిపాటు
- వందల కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:తిరుపతిలో సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కూటమి ప్రభుత్వం కారుచౌకగా ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతోందని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారానికి మంత్రి నారా లోకేశ్ సూత్రధారి,

- మిగతా2లో

# డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం

- నాయుడుపేటలో ఇళ్ల పంపిణీ... ఓ ఇంటికి గుమ్మడికాయ కట్టిన సీఎం చంద్రబాబు...
- రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం
- నాయుడుపేటలో లబ్ధిదారులతో కలిసి ఇళ్లలోకి ప్రవేశించిన సీఎం చంద్రబాబు
- హిందూ లబ్ధిదారు ఇంటిలో సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ముస్లిం కుటుంబంతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన చంద్రబాబు
- కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు పాల్గొన్నారు







పెన్ పవర్ డెస్క్:రాష్ట్రవ్యాప్తంగా పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన 2.5 లక్షల టిడ్కో ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం సోమవారం పండుగ వాతావరణంలో జరిగింది. తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొని ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన లబ్ధిదారులతో కలిసి వారి కొత్త ఇళ్లలోకి ప్రవేశించి శుభాకాంక్షలు తెలిపారు.ముందుగా ముఖ్యమంత్రి, లబ్ధిదారురాలైన ముక్కర అంబిక ఇంటికి వెళ్లి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి వ్రతంలో కూర్చుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం, మరో లబ్ధిదారురాలైన షేక్ నూరి ఇంటికి వెళ్లారు. అక్కడ వారి సంప్రదాయం ప్రకారం జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. నూరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారిని ఆశీర్వదించారు.ఒకే వేదికపై హిందూ, ముస్లిం లబ్ధిదారుల ఇళ్లలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొనడం

- మిగతా2లో

## ఏపీ పోలీసుల ముందు లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

- పోలీసుల ముందు లొంగిపోయిన మావో నేత చెల్లూరు నారాయణరావు అలియాస్ సోమన్న
- ఏవోబీ ప్రాంతంలో దశాబ్దాల పాటు ఆయనది కీలక పాత్ర
- మావోయిస్టుల లొంగుబాటుకు రేపటితో ముగుస్తున్న డెడ్ లైన్

పెన్ పవర్ డెస్క్: దేశవ్యాప్తంగా మావోయిజం నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న వేళ, మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆంధ్రా–ఒడిశా బోర్డర్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, పార్టీలో కీలక వ్యూహకర్తగా ఉన్న చెల్లూరు నారాయణరావు

- మిగతా2లో



## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది: కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

- కేరళ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు
- పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశంపై మోదీ ఎందుకు మాట్లాడలేదన్న రాహుల్
- అవినీతి ఆరోపణలు ఉన్న విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్న

- మిగతా2లో



## హార్మూజ్ తెరవకపోతే ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

### ఇరాన్ కు ట్రంప్ తాజా వార్నింగ్

- హార్మూజ్ జలసంధిని తెరవకపోతే తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- ఖర్గ్ దీవి సహా కీలక చమురు, విద్యుత్ కేంద్రాలను ధ్వంసం చేస్తామని అల్టిమేటం
- చర్చల్లో పురోగతి ఉందని చెబుతున్న ట్రంప్.. అలాంటివేమీ లేవంటున్న ఇరాన్
- మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక మోహరింపుతో పెరుగుతున్న ఉద్రిక్తతలు

- మిగతా2లో



## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్.. రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- దేశవ్యాప్తంగా మరో 11 విమానాశ్రయాల్లో ఉడాన్ యాత్రి కేఫ్‌లు ప్రారంభం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా వర్చువల్ ప్రారంభోత్సవం
- ఈ కేఫ్‌లలో రూ.10కే టీ, వాటర్ బాటిల్, రూ.20కే స్నాక్స్
- స్థానిక రుచులకు ప్రాధాన్యత.. ప్రయాణికుల నుంచి ప్రశంసలు



పెన్ పవర్ డెస్క్:విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# దక్షిణ భారతంపై ఢిల్లీ పెత్తనం

భారతదేశం అనేది రాష్ట్రాల కలయికతో ఏర్పడిన ఒక సమాఖ్య. కానీ, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి ఆ సమాఖ్య పునాదులను పెకిలించి, దేశాన్ని ఒకే రంగు, ఒకే భాష, ఒకే అధికార కేంద్రం కిందకు తెచ్చేందుకు ప్రమాదకరమైన వ్యూహాలను అమలు చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల లేవనెత్తిన అంశాలు కేవలం రాజకీయ విమర్శలు కావు; అవి దక్షిణాది అస్తిత్వంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా వినిపించిన హెచ్చరికలు. ఆర్థికంగా దోపిడీ చేస్తూ, రాజకీయంగా గొంతు నొక్కే ఈ 'నయా సామ్రాజ్యవాద' ధోరణిని దక్షిణాదిలోని ప్రజాస్వామిక, లౌకిక శక్తులు ఐక్యంగా ఎదిరించాల్సిన చారిత్రక అవసరం ఏర్పడింది. దక్షిణాది రాష్ట్రాలు-తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ-దేశ అభ్యున్నతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దేశ భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 20 శాతం, జనాభాలో 19 శాతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు, దేశ జీడీపీలో ఏకంగా 30 శాతం పైగా వాటాను అందిస్తున్నాయి. అయితే, కేంద్ర పన్నుల పంపిణీలో మనకు జరుగుతున్న అన్యాయం విస్మయానికి గురి చేస్తోంది.

కర్ణాటక కేంద్రానికి రూపాయి పన్ను చెల్లిస్తే, తిరిగి పొందుతున్నది కేవలం 15 పైసలు మాత్రమే. తమిళనాడు చెల్లించే ప్రతి రూపాయికి 29 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయి. తెలంగాణ రూపాయికి దాదాపు 40 పైసల లోపే వాటా దక్కుతోంది. ఉత్తరప్రదేశ్, బీహార్ దీనికి భిన్నంగా, ఉత్తరప్రదేశ్ ఒక రూపాయి చెల్లిస్తే దాదాపు 2.70 రూపాయలు, బీహార్ ఏకంగా 7 రూపాయలకు పైగా తిరిగి పొందుతున్నాయి. అభివృద్ధి చెందినందుకు, జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు శిక్ష వేయడం ఏ రకమైన న్యాయం దక్షిణాది కార్మికుల చెమట, ఐటీ నిపుణుల మేధస్సుతో వస్తున్న సంపదను ఉత్తరాదిలోని బీజేపీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి మళ్లించడం ఒక రకమైన 'ఆర్థిక వలసవాదం' కాక మరేమిటి? 2026 తర్వాత జరగబోయే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాజకీయ అస్తిత్వాన్ని నాశనం చేసేలా ఉంది. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గుతుంది లేదా స్థిరంగా ఉంటుంది. అదే సమయంలో, జనాభా విస్ఫోటనం జరిగిన హిందీ రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరుగుతుంది. దీనివల్ల ఢిల్లీ పీఠాన్ని అధిరోహించడానికి దక్షిణాది మద్దతు అవసరం లేని పరిస్థితి ఏర్పడుతుంది. పార్లమెంటులో దక్షిణాది గళం బలహీనపడి, మన ప్రాంతీయ ప్రయోజనాలు పూర్తిగా విస్మరించబడతాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. బాధ్యతాయుతంగా వ్యవహరించిన రాష్ట్రాలను శిక్షించి, బాధ్యతారాహిత్యంగా ఉన్న ప్రాంతాలకు రాజకీయ అధికారం కట్టబెట్టడం 'ఆర్ఎస్ఎస్' మార్క్ అఖండ భారత వ్యూహంలో భాగం.

బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి కేవలం నిధులను మాత్రమే దోచుకోవడం లేదు; మన సంస్కృతిని, భాషను కూడా అణగదొక్కాలని చూస్తోంది. 'హిందీ-హిందూ-హిందుస్థాన్' అనే నినాదంతో దక్షిణాదిలోని విభిన్న భాషా అస్తిత్వాలను తుడిచివేయాలని చూస్తున్నారు. కేరళలో లౌకికవాదాన్ని, తమిళనాడులో ద్రవిడ ఆత్మగౌరవాన్ని, తెలుగు రాష్ట్రాల్లోని ప్రజాస్వామిక సంస్కృతిని విచ్ఛిన్నం చేసేందుకు మతపరమైన చిచ్చు పెడుతున్నారు. దక్షిణాదిలోని కేరళ, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాలు నేటికీ సెక్యులర్ విలువలకి కంచుకోటలు. అందుకే ఈ రాష్ట్రాలపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి లేవనెత్తిన నిధుల అంశం, స్టాలిన్ వినిపిస్తున్న భాషా హక్కుల గళం, పినరయి విజయన్ సాగిస్తున్న ఫెడరలిజం పోరాటం.. ఇవన్నీ ఇప్పుడు ఒకే వేదికపైకి రావాలి. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి దక్షిణాది ముఖ్యమంత్రులందరూ ఒకే గొంతుతో ఢిల్లీని నిలదీయాలి. ఇది కేవలం పాలకుల పోరాటం కాకూడదు. దక్షిణాదిలోని ప్రతి పౌరుడికి ఈ అన్యాయం గురించి తెలియాలి. మా నిధులు మాకే – మా హక్కులు మాకే అనే నినాదం మార్మోగాలి. కార్పొరేట్ శక్తులకు దేశ వనరులను కట్టబెడుతూ, రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి దక్షిణాది నుంచే అసలైన ప్రతిఘటన మొదలవ్వాలి. లెఫ్ట్, డెమోక్రటిక్, సెక్యులర్ శక్తులు ప్రజలను ఆర్గనైజ్ చేసి, ఒక భారీ 'సౌత్ ఇండియా ర్యాలీ' ద్వారా తమ సత్తా చాటాలి. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి దేశానికి గర్వకారణం కావాలి కానీ, అది మన బలహీనత కాకూడదు. ఢిల్లీ పీఠం దక్షిణాదిని శాసించడం కాదు, దక్షిణాది ప్రజాస్వామిక గళం ఢిల్లీని నియంత్రించే రోజు రావాలి. అది మన ఆత్మగౌరవ పోరాటం!

# ఏపీ పోలీసుల ముందు లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

- మొదటి పేజి తరువాయి

అలియాస్ సోమన్న ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ పరిణామం ఏవోబీ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికిని దాదాపు లేకుండా చేసినట్లయ్యిందని భద్రతా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నారాయణరావు ప్రస్థానం పీపుల్స్ వార్ కాలం నుంచే ప్రారంభమైంది. పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పలు కీలక హోదాల్లో పనిచేశారు. ఏవోబీ ప్రాంతంలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంలో, రిక్రూట్‌మెంట్లు చేపట్టడంలో ఆయనది కీలక పాత్ర. అటవీ ప్రాంతంలో దశాబ్దాల కాలం పాటు గెరిల్లా పోరాటంలో ఆరితేరిన సోమన్న లొంగుబాటును ఏపీ డీజీపీ త్వరలోనే అధికారికంగా ధ్రువీకరించనున్నారు.గత ఏడాది కాలంగా ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దుల్లో భద్రతా బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ కగార్' మావోయిస్టుల కోటలను బద్దలు కొట్టింది. ముఖ్యంగా, 2026 మార్చి 31 (రేపు) నాటికి దేశంలో మావోయిజాన్ని పూర్తిగా అంతం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్దేశించిన లక్ష్యం దిశగా బలగాలు దూసుకుపోతున్నాయి. ఈ గడువు ముగియడానికి కేవలం కొన్ని గంటల ముందే అత్యంత కీలక నేత సోమన్న లొంగిపోవడం గమనార్హం.

# రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్

రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులను రూ.404.58 కోట్లుగా చూపించారు. అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తులు మొత్తం రూ. 4,04,58,57,196గా ఉంది. బ్యాంకు డిపాజిట్లు, పెట్టుబడులు, వాహనాలు, ఇతర చరాస్తులతో సహా ఆయన ఆర్థిక వివరాలను ఈ అఫిడవిట్‌లో వివరంగా పొందుపరిచారు. తన వద్ద నగదు రూపంలో రూ.2 లక్షలు, భార్య సంగీత వద్ద రూ.1 లక్ష ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో రూ.388 కోట్లు ఉన్నట్లు తెలిపారు. తన వద్ద బీఎండబ్ల్యూ 530, బీఎండబ్ల్యూ ఐ7, టయోటా లెక్సస్ 350, టయోటా వెల్‌ఫైర్ వంటి ఖరీదైన కార్లతో పాటు ఇతర ఆటోమొబైల్స్, ద్విచక్ర వాహనాలు కూడా ఉన్నాయని పొందుపరిచారు. వాహనాల మొత్తం విలువ రూ.14.35 కోట్లుగా పేర్కొన్నారు.

తన వద్ద 883 గ్రాముల బంగారం, దాని విలువ రూ.1.20 కోట్లు ఉంటుందని వెల్లడించారు. రూ.15 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు వెల్లడించారు. తనవద్ద ఉన్న స్థిరాస్తుల్లో తాను కొన్నవాటితో పాటు, వారసత్వంగా వచ్చినవి కూడా ఉన్నాయని వెల్లడించారు. స్వయం ఉపాధి, వడ్డీ, ఆస్తుల నుంచి వచ్చే అద్దె తన ప్రధాన ఆదాయవనరు అని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 184.53 కోట్ల ఆదాయం ఆర్జించినట్లు విజయ్ పేర్కొన్నారు.

# తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

తిరుమల కొండపై భక్తుల రద్దీ కాస్త తగ్గింది. సోమవారం కావడంతో భక్తుల తాకిడి సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. ప్రస్తుతం 10 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు.నిన్న ఆదివారం (మార్చి 29) నాడు మొత్తం 80,774 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 27,447 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆదివారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది.

సాధారణంగా వారాంతాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండి, కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోతుంటాయి. అయితే, వారాంతం ముగియడంతో ప్రస్తుతం రద్దీ కాస్త అదుపులో ఉంది. భక్తులు తక్కువ సమయంలోనే దర్శనం చేసుకుంటున్నారు.

# ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది: కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయ విమర్శల పదును పెంచారు. రాష్ట్రంలో అధికార ఎల్డీఎఫ్ (వామపక్ష కూటమి) – కేంద్రంలోని బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పత్తనంతిట్ట జిల్లా అడూర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ... కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేవలం వామపక్షాలతోనే కాకుండా, 'ఎల్డీఎఫ్-బీజేపీ' కూటమితో కూడా పోరాడుతోందని అన్నారు.పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల ఆలయ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదని రాహుల్ ప్రశ్నించారు. ఆలయ బంగారాన్ని కాజేశారన్న ఆరోపణలపై ప్రధాని మౌనం వహించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందన్నారు. కేవలం ఓట్ల కోసమే మోదీకి గుడులు, మతం గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు.కేంద్ర దర్యాప్తు సంస్థలు కేవలం తన వంటి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, 36 కేసులు పెట్టి 55 గంటల పాటు విచారించాయని రాహుల్ గుర్తు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం పినరయి విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. విజయన్ అవినీతి మరకల వల్లే మోదీ గుప్పిట్లో ఉన్నారని, అందుకే వామపక్ష ప్రభుత్వం 'కార్పొరేట్ నిధుల ప్రభుత్వం'గా మారిందని విమర్శించారు.

# హర్మూజ్ తెరవకపోతే ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని, లేనిపక్షంలో ఇరాన్‌లోని ఖర్గ్ దీవితో సహా కీలకమైన చమురు బావులు, విద్యుత్ కేంద్రాలను పేల్చివేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్తతలను పెంచింది.

ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్, ఇరాన్‌లోని కొత్త నాయకత్వంతో చర్చలు జరుపుతున్నామని, వాటిలో గణనీయమైన పురోగతి ఉందని తెలిపారు. అయితే, ఒప్పందం త్వరగా కుదరకపోయినా లేదా హర్మూజ్ జలసంధిని తెరవకపోయినా తీవ్ర చర్యలు తప్పవన్నారు. ఇరాన్‌లోని చమురు బావులు, విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు, ఇతర కీలక సౌకర్యాలను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు ఉద్దేశపూర్వకంగా వదిలేసిన మంచినీటి డీశాలినేషన్ ప్లాంట్లను కూడా లక్ష్యంగా చేసుకునే అవకాశాలున్నాయని సంకేతాలిచ్చారు. గత 47 ఏళ్ల ఇరాన్ పాలనలో మరణించిన అమెరికా సైనికులకు ప్రతీకారంగానే ఈ చర్యలు ఉంటాయని ట్రంప్ స్పష్టం చేశారు.ఒకవైపు చర్చల్లో పురోగతి ఉందని ట్రంప్ చెబుతున్నప్పటికీ, మరోవైపు అమెరికా ఆ ప్రాంతంలో అదనపు సైన్యాన్ని మోహరిస్తోంది. దీనిపై ఇరాన్ పార్లమెంట్ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చర్చల పేరుతో అమెరికా దండయాత్రకు సిద్ధమవుతోందని వారు ఆరోపించారు. అయితే, అమెరికాతో ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగడం లేదని

ఇరాన్ నాయకులు ఖండించారు.

ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ సైనిక శక్తులు ఇటీవల నౌకాయానానికి దాదాపు మూసివేశాయి. గతంలో ఇరాన్ ఇంధన కేంద్రాలపై దాడులను 10 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించగా, ఆ గడువు ఏప్రిల్ 6తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు ప్రపంచ చమురు మార్కెట్లపై, మధ్యప్రాచ్య భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి.

# ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్.. రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- మొదటి పేజి తరువాయి

ఏర్పాటు చేసిన "ఉడాన్ యాత్రి కేఫ్"ల సేవలను మరింత విస్తరించింది. తాజాగా దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేఫ్‌లలో టీ, కాఫీ, సమోసా, వాటర్ బాటిల్ వంటివి కేవలం రూ.10 నుంచే లభించనున్నాయి.రాజ్‌కోట్ విమానాశ్రయం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ కేఫ్‌లతో పాటు దేశవ్యాప్తంగా 57 విమానాశ్రయాల్లో ప్రయాణికులకు ఉపయోగపడే పలు ఇతర సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్‌లలో లక్నో, పాట్నా, రాజ్‌కోట్, జమ్మూ, శ్రీనగర్, జైపూర్, ఇండోర్ వంటి కీలక విమానాశ్రయాలు ఉన్నాయి. వీటితో పాటు డిజి యాత్ర, ఉచిత వైఫై సేవలు, ప్రయాణికుల కోసం ఉచిత గ్రంథాలయం 'ఫ్లైబ్రరీ', పిల్లల కోసం ప్రత్యేకంగా 'కిడ్స్ జోన్' వంటి సౌకర్యాలను కూడా ప్రారంభించారు. స్థానిక స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 'అవ్సార్' (ూాఋాూా=) ఔట్‌లెట్లను కూడా తెరిచారు.

### అందుబాటు ధరలు.. స్థానిక రుచులు

ఈ ఉడాన్ యాత్రి కేఫ్‌లలో ధరలు చాలా అందుబాటులో ఉంటాయి. సాధారణంగా టీ రూ.10, వాటర్ బాటిల్ రూ.10, కాఫీ రూ.20, స్నాక్ రూ.20, స్వీట్ ఆఫ్ ది డే రూ.20కి లభిస్తుంది. ఈ కేఫ్‌ల మెనూలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాల

స్థానిక రుచులకు ప్రాధాన్యత ఇవ్వడం. ఉదాహరణకు పుణె ఎయిర్‌పోర్టులో వడా పావ్, చెన్నైలో వడై, కోయంబత్తూరులో మెధు వడ వంటివి అందిస్తున్నారు. అయితే, దాదాపు అన్ని కేఫ్‌లలో సమోసా కామన్‌గా లభిస్తోంది.

ఇప్పటికే కోల్‌కతా, చెన్నై, పుణె, విజయవాడ, ఇటానగర్, భువనేశ్వర్, సూరత్, అహ్మదాబాద్, ముంబై, మంగళూరు, తిరువనంతపురం, కోయంబత్తూరు విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి. తాజాగా మరో 11 చోట్ల వీటిని ప్రారంభించడంతో ప్రయాణికులపై భారం తగ్గనుంది.

# డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం

- మొదటి పేజి తరువాయి

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కొలుసు పార్థసారధి, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీ, పలువురు ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు, రికార్డు చేయవు

- మొదటి పేజి తరువాయి

భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ అంశంపై ఆమె మాట్లాడారు. వస్తువుల ఆధారంగా బీమా కవరేజీ ఉంటుందనే వాదనను ఆమె తోసిపుచ్చారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయని అన్నారు. లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కానీ లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీ చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని స్పష్టం చేశారు.

# పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు మీరు అందిస్తున్న సహకారం అభినందనీయం. నాకున్న అనుభవానికి తోడుగా, ఉత్తమ ఆకాంక్షలు, ఆదర్శాలు కలిగిన మీ వంటి ప్రజానేతలు కలిసివస్తే రాష్ట్రానికి, దేశానికి ఎంతటి మేలు జరుగుతుందో గత 20 నెలల పాలన ఒక నిదర్శనం" అని పవన్ కల్యాణ్ ను ఉద్దేశించి పేర్కొన్నారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడిన తమ కూటమి ఐక్యతా స్ఫూర్తి ఇలాగే పదికాలాల పాటు కొనసాగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో పవన్ కల్యాణ్ వంటి నేతల పాత్ర కీలకమని, ఆయన తోడ్పాటుతో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకువెళతామని చంద్రబాబు తన సందేశంలో స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఉన్న సమన్వయం రాష్ట్రానికి శుభపరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు.

# కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారింది

- మొదటి పేజి తరువాయి

మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. మచిలీపట్నంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసిన ఆయన... ఆర్డీవో, ఎమ్మార్వోలపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారిందని నాని ఆరోపించారు. "వందల ఎకరాలు ఉన్న బడా రైతులకు రెడ్ కార్పెట్ పరుస్తున్న అధికారులు... ఎకరం, అర ఎకరం ఉన్న చిన్న రైతులను మాత్రం పట్టిపీడిస్తున్నారు. చెరువు రిపేరు చేయాలన్నా రూ. 50 వేలు, బోరు వేయాలన్నా మరో రూ. 50 వేలు వసూలు చేస్తూ వికృత సంస్కృతికి తెరలేపారు" అని ధ్వజమెత్తారు.పెదపట్నం, కానూరు గ్రామాల్లో మడ అడవులను యథేచ్ఛగా నరికి చెరువులు తవ్వుతుంటే పట్టించుకోని అధికారులు, కోన గ్రామంలోని ఓ చిన్న రైతును రికార్డుల పేరుతో వేధించడం దారుణమన్నారు. 83 సెంట్ల భూమి ఉన్న రైతును ఆర్డీవో సాంబశివరావు నానా హైరానా పెట్టి, చెరువును పూడ్చాలని ఆదేశించడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు. ముడుపుల మాయలో పడి చిన్న రైతుల పొట్ట కొట్టాలని చూస్తే సహించేది లేదని, బాధితుల పక్షాన పోరాడతామని పేర్ని నాని హెచ్చరించారు.

## తిరుపతిలో వెయ్యి కోట్ల భూదందా..

- మొదటి పేజి తరువాయి

పాత్రధారి అని ఆయన ఆరోపించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ ఆరోపణలు గుప్పించారు. తిరుపతి నడిబొడ్డున ఉన్న 22 ఎకరాల విలువైన భూమిని కేవలం 94 కోట్ల రూపాయలకే రెండు రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించారని భూమన ఆరోపించారు. "దివ్యశ్రీ రియల్ ఎస్టేట్ (బెంగళూరు), సైబర్ సిటీ డెవలపర్ (హైదరాబాద్) సంస్థలకు ఎటువంటి బహిరంగ ప్రకటన లేకుండానే భూములు దోచిపెట్టారు. ఈ సంస్థల్లో లోకేశ్ భాగస్వామిగా ఉన్నారా? లేక ఇవి ఆయన బినామీ సంస్థలా?" అని ప్రశ్నించారు. ఈ ఒప్పందం వెనుక సుమారు 300 నుంచి 400 కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరకు అమ్మడమే కాకుండా, సదరు సంస్థలకు అసాధారణ రాయితీలు కల్పించారని భూమన విమర్శించారు. 15 ఏళ్ల పాటు ఏపీ జీఎస్టీ ప్రోత్సాహకాలు, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్ కల్పించారని అన్నారు. ఐదేళ్ల పాటు ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. సాధారణంగా టూరిజం ప్రాజెక్టులను పీపీపీ విధానంలో ఇస్తారని, కానీ ఇక్కడ 'ఫ్రీ హోల్డ్' విధానంలో కట్టబెట్టడం వెనుక పెద్ద మతలబు ఉందని ఆరోపించారు.

ఎలాంటి అనుభవం లేని రియల్ ఎస్టేట్ సంస్థలకు వందల కోట్ల విలువైన భూములు కేటాయించడంలో ఆంతర్యమేమిటని భూమన ప్రశ్నించారు. తిరుపతి ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈ భూదందాను అడ్డుకుని తీరుతామని ఆయన హెచ్చరించారు.

# బూరుగుపూడి సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తాం..

చైర్మన్ కంటే కేశవరావు



**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 30:**బూరుగుపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని సొసైటీ చైర్మన్ కంటే కేశవరావు తెలిపారు. కోరుకొండ మండలంలోని బూరుగుపూడి సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన మహాజనసభ సమావేశంలో ఆయన మాట్లాడారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులందరికీ అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సాగు పనుల సమయంలో రైతులకు పెట్టుబడి ఇబ్బందులు లేకుండా చూస్తామని, అర్హులైన ప్రతి రైతుకూ రుణాలు (లోన్లు) మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఎటువంటి వివక్ష లేకుండా పారదర్శకంగా రుణాల పంపిణీ జరుగుతుంది. సకాలంలో సేవలు విత్తనాలు, ఎరువుల సరఫరాలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. సొసైటీ బలోపేతం నూతన పథకాల ద్వారా సొసైటీని లాభాల బాటలో నడిపిస్తాం. ఈ కార్యక్రమంలో సొసైటీ పాలక వర్గ సభ్యులు, సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## జిల్లా లో పి 4 లో 67, 801 బంగారు కుటుంబాలను గుర్తింపు



మంత్రి నిమ్మల రామానాయుడు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 30**

సామాజిక వెనుకబాటు ఉండకూడదనే అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యం గా పి-4 కార్యక్రమం అమలు చేస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. స్తానిక కలెక్టరేట్ లో నిర్వహించిన పి-4 వార్షికోత్సవ కార్యక్రమంలో సోమవారం మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ -2047 లక్ష్యంతో పేదరిక నిర్మూలన దిశగా గతేడాది పి -4 కార్యక్రమం ప్రారంభించిన కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు

ప్రజలు, పారిశ్రామికవేత్తలు, ఎన్నారైల సాయంతో రాష్ట్రంలో పేదరిక నిర్మూలించే దిశగా పి -4 కార్యక్రమం చేపట్టారు.తూ. గో జిల్లా లో 67, 801 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు.జిల్లాలో 4,422 మంది మార్గ దర్శకుల సహకారం తో 27,333 కుటుంబాలను దత్తత తీసుకుని చేయూత ఇస్తున్నామన్నారు

జిల్లా, నియోజకవర్గం స్థాయి లో ఉత్తమ సేవలందించిన మార్గద ర్శకులను మంత్రి నిమ్మల సత్కరించారు. ఆర్థికంగా అగ్రభాగాన ఉన్న 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మందికి ఆసరాగా ఉండటమే పి -4 లక్ష్యమన్నారు.

## పి4 మార్గదర్శిగా బాపన్న దొర



**వై రామవరం, పెన్ పవర్,మార్చి 30 :** రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో పీ4 మార్గదర్శిగా వైరామవరం ఎంపీడీవో కే. బాపన్న దొరను ఎంపిక చేసి సోమవారం రంపచోడవరం లో సన్మానించారు.

ప్రభుత్వం ఆదేశానుసారం 2047 ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పి4 కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో పి4 అమలు చేయడంలో అందరికీ మార్గదర్శిగా నిలిచిన వై.రామవరం ఎంపీడీవో కే.బాపన్న దొరను సోమవారం స్థానిక ఎమ్మెల్యే శిరీష దేవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోల్ల బొజ్జి రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పోలవరం జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బచ్చు స్మరణ రాజ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి,సంక్షేమం పి4తో సాధ్యం: ఎమ్మెల్యే బొలిశెట్టి.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 30:** అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమం కూడా పి4 విధానంలో సాధించవచ్చని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే విడిది కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక, పి4 కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు, స్వీకరించి,పరిష్కరించే విధంగా అధికారులకు సూచనలు చేశారు. పి4 విధానం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రూపొందించిన పి-4 విధానంలో పేద కుటుంబాలను దత్తత తీసుకొని, వారిని అభివృద్ధి చేసే విధంగా, ఆర్థికంగా వెసులుబాటు ఉన్న ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని అన్నారు.పి 4తో పట్టణంలో బృహత్తర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలిగామన్నారు. ఈతకొలను, ఇండోర్ స్టేడియం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా కేంద్రం తదితర అభివృద్ధి పనులను ప్రజల భాగస్వామ్యంతో సాధించామన్నారు. రెండవ పంపుల చెరువును అమృత పథకం2లో పూర్తి చేస్తున్నామన్నారు. ప్రజలకు మేలు చేయాలనే తపన తో పనిచేస్తున్నామన్నారు. మీడియాలో ప్రచారం కంటే ప్రజల మనసుల్లో స్థానం పొందడం రాజకీయ నాయకులకు ముఖ్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. అందరూ కలిస్తే ఘన విజయాలు సాధించవచ్చని శ్రీశ్రీశ్రీ బలుసులమ్మ అమ్మవారి జాతరతో నిరూపించామన్నారు. తాను వ్యక్తిగతంగా చేయగలిగినంత సహకారం ప్రజలకు అందిస్తున్నానని అన్నారు. అవకాశం ఉన్న వారందరూ భాగస్వాములు కావాలన్నారు. పి 4 పథకం తో పుణ్యం,పురుషార్థం, అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. తాను వ్యక్తిగతంగా 16 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో కొందరు ప్రముఖులు పి4లో భాగస్తులయ్యారు. ఒకొక్కరు ఐదు కుటుంబాల చొప్పున దత్తత తీసుకున్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి ఈతకోట తాతాజీ, బిజెపి జిల్లా మీడియా ఇన్ఛార్జి నరిసే సోమేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, టిడిపి జిల్లా నాయకులువాడపల్లి సుబ్బరాజు ఒకొక్కరూ 5 కుటుంబాల చొప్పున20 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రతినెల 1000 రూపాయలు చొప్పున ఆర్థిక సహకారం అందిస్తామని ప్రకటించారు. ఈ బంగారు కుటుంబ పథకంలో పేర్లు నమోదు చేసుకోవాలనుకునే వారు పురపాలక, మండల అధికారులను సంప్రదించవచ్చని ఎమ్మెల్యే తెలియజేశారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి, సంక్షేమం సాధించడానికి అంకితభావంతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జునరావు, ఎమ్మార్వో రాజరాజేశ్వరి, అధికారులు మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, పెంటపాడు ఎస్ఐ స్వామి,బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, చేపల రమేష్, జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, పుల్లా బాబి, తోట రాజా,రుద్రా రమేష్,ఆకాశపు స్వామి, దువ్వ శ్రీను, మద్దాల మణికుమార్, వాడపల్లి సుబ్బరాజు, గొర్రెల శ్రీధర్, పసల కొండ, పాలూరి వెంకటేశ్వరరావు, పసుమర్తి రామ లక్ష్మణ్, పట్నాల రాంపండు, నరిసే సోమేశ్వరరావు, పై బోయిన వెంకటరామయ్య, నల్లగంచి రాంబాబు, గట్టం నాని, మద్దిపాటి ధర్మేంద్ర, వట్టికూటి అబ్బు, బూరుగుపల్లి వెంగళరావు, మలపాక చిట్టి, పిడుగు రామ్మోహన్ బ్రదర్, కూటమి నాయకులు కార్యకర్తలు వీర మహిళలు అధికారులు వ్యాపార వ్యక్తులు పాల్గొన్నారు



భీమవరం కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న బ్రహ్మసూత్ర సోమేశ్వర స్వామి వారి ప్రదోషకాల అలంకారం

## నిర్లక్ష్యం మాటున ప్రమాదం.!



✷ చోద్యం చూస్తున్న అధికారులు

**సీతానగరం, పెన్ పవర్, మార్చి30:**ఇసుక రవాణా వాహనదారుల నిర్లక్ష్యానికి ద్విచక్ర వాహనదారులు బలైపోతున్నారు. ఇసుక లారీలలో నిబంధనలకు విరుద్ధంగా వాహన సామర్థ్యానికి మించి టన్నులకొద్దీ ఇసుక రవాణా సాగిస్తున్నారు. దీంతో సీతానగరం మండలంలోని ఇసుక ర్యాంపుల నుండి జరుగుతున్న తోలకాలలో అధికారులు చోద్యం చూస్తున్నారని వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇసుక లోడ్ చేసుకుని వస్తున్న లారీల నుండి నీరు కారుతూ వెనుక నుంచి వస్తున్న వాహనదారులకు బరకం కప్పక పోవడంతో ఇసుకతో పాటు నీళ్లు కూడా దారి కనబడకుండా చేస్తున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రకారం నదీ గర్భంలో రోడ్ల నిర్మాణం చేయవచ్చా. అనుమతులకు మించి నీళ్లు కారేవిధంగా నదీగర్భంలో ఇసుక తవ్వకాలు జరపవచ్చా అనే సందేహాలు ప్రజల్లో వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వాయ లోపంతో ర్యాంపులనిర్వాహకులు వరంగా మారింది. కొన్ని ఇసుక ర్యాంపులో రాత్రి పగలు తేడా లేకుండా తోలకాలు జరుగుతున్న అడపా దడపా కేసులు నమోదు చేస్తు చేతులు దులుపుకుంటున్న అధికారులు అనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. దీనితో ర్యాంపుల నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా నది గర్భంలో 200 పవర్ జెసిపి లతో అనుమతులకు మించి లోతుకు తవ్వుతూ పర్యావరణానికి హాని కలిగించడంతో పాటు లంక గ్రామానికి పెనుముప్పుగా మారబోతుంది అనడంలో సందేశం లేదు. దీనిపై అధికారులు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంలో కోరుతున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పోలవరం జిల్లా అభివృద్ధికి సహకరించండి



జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ను కలిసిన ఎమ్మెల్యే శిరీషాదేవి



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 30:**పోలవరం జిల్లా వైశాల్యంలో చాలా పెద్దదని దాని అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ దినేష్ కుమార్ ను రంప చోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి కోరారు. రంపచోడవరం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆమె నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ దినేష్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నెలకొన్న పలు కీలక విషయాలు పై చర్చించారు. గిరిజన ప్రాంత సమగ్రాభివృద్ధి కొరకు విద్యా, వైద్యం, మౌలిక వసతుల కల్పన, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో నెలకొన్న పలు సమస్యలు, ఆర్థికాభివృద్ధికి పలు పరిశ్రమలు ఏర్పాటు పై క్షుణ్ణంగా వివరించారు. కుల దృవీకరణ పత్రాల మంజూరులో కొన్ని గిరిజన తెగలు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులపై కలెక్టర్ కి , జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బచ్చు స్మరణ రాజ్ లకు వివరించారు. దీనిపై స్పందిస్తూ పరిష్కార చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్లె సునీత, రంపచోడవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి, తెదేపా సీనియర్ నాయకులు గణజాల తాతారావు తదితరులు ఉన్నారు.

# టూరిజం పేరుతో దోపిడీ ఆపాలి

- మారేడుమిల్లి--చింతలపూడి రహదారి నాణ్యతపై విచారణ కు డిమాండ్
- సిపిఎం డిమాండ్



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 30 :** మారేడుమిల్లి మండలంలో అభివృద్ధి పేరుతో జరుగుతున్న టూరిజం వల్ల సాధారణ ప్రజలకు ప్రయోజనం కంటే ఇబ్బందులే ఎక్కువగా ఉన్నాయని సీపీఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ నాయకులు మట్ల. వాణిశ్రీ, ఈతపల్లి సత్యనారాయణ రెడ్డి ఆరోపించారు.మండలంలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, చికెన్ తదితరాలు మైదాన ప్రాంతాలతో పోలిస్తే అధిక ధరలకు విక్రయిస్తున్నారని వారు తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచుతున్నారని విమర్శించారు. టూరిజాన్ని అడ్డుగా పెట్టుకొని గిరిజన ప్రజలను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అందువల్ల సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ప్రతి వ్యాపార స్థావరాన్ని పరిశీలించి అధిక ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం జరిగేలా కఠిన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు.ఇక మారేడుమిల్లి నుంచి చింతలపూడి వరకు నిర్మాణంలో ఉన్న రహదారి పనుల్లో నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తోందని వారు ఆరోపించారు. కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా పనులు నిర్వహిస్తున్నారని, నాసిరకం పనులను సహించబోమని హెచ్చరించారు.రోడ్డు పనులపై సంబంధిత శాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి నాణ్యతను నిర్ధారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు.

## రాబందులు అంతరించిపోయాయా.. ప్రభుత్వాలు సంరక్షణకు ఆలోచన చెయ్యండి.

- ఎక్కడా కనిపించని రాబందులు...మానవ తప్పిదాలే కారణమా....
- జాతిని పునరుద్ధించే విషయంపై అధికారులు దృష్టి పెట్టాలి
- ఉమ్మడి తెలుగు రాష్ట్రా ప్రభుత్వాలకు జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ విజ్ఞప్తి.





**గోకవరం పెన్ పవర్ మార్చి 30 :--** అంతరించి పోతున్న పక్షి జాతులలో రాబందు ముందు వరసలో ఉన్నాయి. మానవ తప్పిదాలకు ఒక పెద్ద పక్షి జాతి అంతరించి పోయింది అనడం లో అతిశయోక్తి లేదు. గుంపులు గుంపులుగా కని పించే పక్షులు నేడు ఎక్కడా కనిపించటం లేదు. వాటి సంరక్షణ కోసం ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామాల్లో,పొలాల్లో విరివిగా తిరిగే భారీ పక్షులు కను మరుగు అయ్యి పోయాయి. తిరిగి వీటి జాతిని పునరుద్దించే విధంగా అధికారులు ప్రయత్నాలు చేస్తే బావుంటుందని జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ బత్తిన రామకృష్ణ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను కోరుతున్నారు. పక్షి జాతులలో ఇట్టే గుర్తుపట్టే జాతుల్లో రాబందులు పేరుకు పెద్దగా పరిచయం అవసరం లేదు. ఎక్కడైనా మృత కళేబరాలు ఉంటే క్షణాల్లో గుంపులు,గుంపులుగా వచ్చి వాలేవి. ముఖ్యంగా విశాలమైన మైదాన ప్రాంతాల్లో, పొలాల్లో, ఎత్తైన కొండలు,పెద్ద పెద్ద చెట్లు నీటి వనరులు వద్ద ఎక్కువగా కనిపించేవి. పొలాల్లో పడేసిన కళేబరాలను తినటానికి వచ్చినపుడు వీటిని చూడటానికి జనాలు ఆశక్తి కనబర్చేవారు. పొడవాటి ముక్కు, పెద్ద రెక్కలు ఎగురుతూవెళుంటే చిన్నపాటి విమానం వెళ్తున్నట్లుగా ఉండేది. కాలక్రమేణా ఈ రాబందు జాతి అంతరించి పోవడానికి పశువుల కోసం వాడే డైక్లోఫినాక్ అనే పెయిన్ కిల్లర్ మందు కారణంగా రాబందులు అంతరించి పోయాయని అధికారులు చెపుతున్నారు. ఈ మందు రాబందులు మూత్ర పిండాల వ్యవస్థను నాశనం చేసినట్లు చెప్పారు.ఈ కారణంగా రాబందులు జాతి అంతరించిపోయినట్లు చెబుతున్నారు. రాబందులు వల్ల మానవునికి ప్రకృతిని కి మేలు జరిగింది తప్పా కీడు లేదు. మృత కళేబరాలను తినేసి వాటి నుండి వ్యాప్తి చెందే క్రిములను నాశనం చేసేవి రావందులేనని పలు పరిశోధనలో తేలింది. భారీగా దుర్గంధం రాకుండా శుభ్రంగా కళేబరాన్ని తినేసేవి. అంతరించిపోయిన ఈ జాతిని తిరిగి తీసుకొచ్చే విధంగా అధికారులు ప్రయత్నాలు చేయాలని జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ బత్తిన రామకృష్ణ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను కోరుతున్నారు.ఇతర రాష్ట్రాల్లో కొన్ని చోట్ల రాబందులకు ప్రత్యేకంగా రాబందుల పరిరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారని వీటికి కావాల్సిన వసతులు ఆహారం సమకూర్చి ఆయా ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు. రోజు రోజుకి ఇతర రాష్టాల్లో రాబందుల సంతతి అభివృద్ధి చెందుతుంది. ఇదే విధంగా మన తెలుగు రాష్టాల్లో కూడా అక్కడ నుండి కొన్ని రాబందులను దిగుమతి చేసుకుని వాటిని,వాటి సంతతిని అభివృద్ధి చేస్తే బావుంటుందని జాస్మిన్ స్వచ్ఛందసేవా సంస్థ డైరెక్టర్ బత్తిన రామకృష్ణ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేస్తే మళ్ళీ రాబందులను చూడొచ్చు అని అంటున్నారు. సాధ్యా సాధ్యాలపై అధికారులు ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇది కనుక జరిగితే మన తర్వాతి తరం అయినా రాబందులను చూడొచ్చు అని జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ బత్తిన రామకృష్ణ సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు.మృత కళేబరాలలో ఉండే బ్యాక్టీరియా క్రిములు వాయువులో కలవకుండా రాబందులు పూర్తిగా తిని మానవజాతిని కాపాడ డానికి ఎంతో కొంత ఉపయోగపడి ఉండేవని అవి లేకపోవడం కూడా కొంత ఇబ్బంది అని జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ బత్తిన రామకృష్ణ అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధతో అంతరించి పోయిన రాబందులు సంరక్షణ కేంద్రాల ద్వారా పునరుత్పత్తికి ప్రయత్నం చేస్తే తర్వాత తరానికి ఇటువంటి జాతులు వల్ల జరిగే మేలును అందించిన వారము అవుతామని ఆయన అభిప్రాయపడ్డారు.

## పోలవరం పిజిఆర్ఎస్‌లో 150 అర్జీలు -- పరిష్కారానికి కలెక్టర్ దిశానిర్దేశం





- “100% ప్రజల సంతృప్తి లక్ష్యం” -- అధికారులకు హెచ్చరిక
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 30:**జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ సమావేశంలో మొత్తం 150 అర్జీలు స్వీకరించగా, రెవెన్యూ క్లినిక్‌లో 2 అర్జీలు అందినట్లు తెలిపారు.

ప్రతి శాఖ “100 శాతం ప్రజల సంతృప్తి” లక్ష్యంగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. కొత్త జిల్లాగా ఏర్పడిన పోలవరం ప్రాంతంలో ఉన్న సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని, టీం వర్క్‌తో ముందుకు సాగాలని సూచించారు.

**క్షేత్రస్థాయిలోనే పరిష్కారం**

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలని, క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఏ శాఖకు సంబంధించిన సమాచారమైనా సంబంధిత అధికారులే నేరుగా అందించాలని, ఆలస్యం లేకుండా స్పందించాలని సూచించారు.

**పెండింగ్ అర్జీలపై ఆందోళన**

ప్రస్తుతం 171 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. వాటర్ రిసోర్సెస్, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్ శాఖల్లో అధికంగా పెండింగ్ కేసులు ఉన్నాయని తెలిపారు. వీటిని 24 నుంచి 48 గంటల్లో పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో ఎస్ ఎల్ ఏ ప్రమాణాలను తప్పక పాటించాలని, ప్రజల సంతృప్తిపై ఆడిట్ నిర్వహించాలని పేర్కొన్నారు.

**ప్రత్యేక అధికారుల నియామకం**

మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో జాయింట్ కలెక్టర్ ప్రత్యేక అధికారిగా వ్యవహరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలోజిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్, డి ఆర్ వో పి.. అంబేద్కర్, డిప్యూటీ డైరెక్టర్ (ఎడ్యుకేషన్) రుక్మండయ్యా, పశు సంవర్ధక శాఖ డి డి షరీఫ్, పిడి డీఆర్డీఏ. డీ కమలాకర రావు, డి ఎమ్ హెచ్ వో డా పి సరిత , జిల్లా వ్యవసాయ అధికారి కె రామ్ మోహన్ రావు, జిల్లా ఉద్యన అధికారి దేవ దానం తదితరులు పాల్గొన్నారు.

## ఐపీఎల్ బెట్టింగ్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 30:**క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ హెచ్చరించారు.ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లను ఆసరాగా చేసుకొని, అమాయక ప్రజలు, యువతను లక్ష్యంగా చేసుకుని “సులభంగా డబ్బు సంపాదించవచ్చు” అనే మాయ మాటలతో క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 112కు కాల్ చేయండన్నారు.

బెట్టింగ్ అనేది కేవలం డబ్బు పోగొట్టుకోవడం మాత్రమే కాదనీ, మానసిక ఒత్తిడికి, కుటుంబ కలహాలకు, ఆత్మహత్యలకు దారితీస్తుందన్నారు . బెట్టింగ్ యాప్‌లకు నో చెప్పండని, భవిష్యత్తును కాపాడుకోండని ఎస్పీ పిలుపునిచ్చారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని, కెరీర్‌పై ప్రభావం చూపుతుందని గుర్తుచేశారు.

జిల్లా వ్యాప్తంగా క్రికెట్ బెట్టింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక పోలీసు బృందాలతో నిఘాను మరింత కట్టుదిట్టం చేస్తున్నట్లు తెలిపారు.

బెట్టింగ్ నిర్వహించే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే డయల్ 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని ఆయన హెచ్చరించారు.



## పోలవరం జిల్లా నూతన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బీటీఏ నాయకులు



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 30:**నూతనంగా ఏర్పడిన పోలవరం జిల్లాకు మొట్టమొదటి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె. దినేష్ కుమార్ ని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా బీటీఏ జిల్లా గౌరవ అధ్యక్షులు బోండ్ల ప్రసాద్ , జిల్లా అధ్యక్షులు ఎం.రాజేశ్వరరావు , జిల్లా కార్యదర్శి వంతల చిన్నారావు కలెక్టర్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.జిల్లాలో విద్యా రంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సమస్యలు, పాఠశాలల మౌలిక వసతుల మెరుగుదల వంటి అంశాలపై కలెక్టర్ దృష్టి సారించాలని వారు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## సోనియా గాంధీ కి సంపూర్ణ ఆరోగ్యం కలగాలని కాంగ్రెస్ శ్రేణుల పూజలు




**రాజమహేంద్రవరం , పెన్ పవర్, మార్చి 30**

యూపీఏ మాజీ చైర్ పర్సన్, ఏ ఐ సి సి మాజీ అధ్యక్షురాలు, సోనియా గాంధీ సంపూర్ణ ఆరోగ్యంతో మళ్ళీ తిరిగి కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనాలని ఆ పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు. ఆమె సంపూర్ణ ఆరోగ్యానికై అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆధ్వర్యంలో స్థానిక గోదావరి గట్టు క్షేత్రపాలక వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం పూజలు నిర్వహించారు. ఆమెకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగని, ఆమె త్వరగా కోలుకుని మళ్లీ పార్టీని నడిపించేందుకు శక్తిని అందించాలని కోరుతూ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా బాలేపల్లి మురళీధర్, రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ టికే విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన సోనియా గాంధీ త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి వస్తారన్నారు. ప్రస్తుతం అస్వస్థతతో సర్ గంగారాం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని తెలిపారు. కాంగ్రెస్ లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆమె ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారన్నారు. ఆమె నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా బలంగా పనిచేస్తుందని తెలిపారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆలయాలతో పాటు మసీదులు, చర్చిల్లో కూడా ప్రార్థనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవత సుధాకర్, కిషోర్ కుమార్ జైన్, మేడవరపు భద్రం దొర, డాక్టర్ యాళ్ల వీరభద్రరావు, నిల్లా వీర్రాజు, బర్రె సుబ్రహ్మణ్యం, తాడాల కొండరాజు, జెటి రామారావు, చిన్నం మురళీకృష్ణ, తాడి సూరిబాబు, పెచ్చెట్టి ధరణి పతి తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ పీజీఆర్ఎస్ లో 34 అర్జీలు స్వీకరణ

- సూపరింటెండెంట్ ఇంజనీర్ రీటా




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 30:**ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ప్రజల ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారం చూపాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ రీటా అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించగా, మొత్తం 34 అర్జీలు వచ్చాయి. వీటిలో ఇంజనీరింగ్ కి 4, రెవెన్యూకి 11, టౌన్ ప్లానింగ్ కి 9, పబ్లిక్ హెల్త్ కి 3, పింఛన్లకు 6, అడ్మినిస్ట్రేషన్ కు సంబంధించి ఒకటి ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులకు సూచించారు. సమస్య పరిష్కారం అయితే ప్రజలలో సంతృప్తి స్థాయి పెరుగుతుందని, ప్రతి అర్జీదారునితో ముఖాముఖిగా మాట్లాడాలన్నారు. ఏ ఒక్క అర్జీ పెండింగ్ లో లేకుండా చూసుకోవాలన్నారు. నిర్ణీత గడువులోగా ఆయా సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. గ్రీవెన్స్ అర్జీలపై ఆడిట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, మేనేజర్ అబ్దుల్ మలిక్, ఈఈలు మదర్సా అలీ, మాధవి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు

### హిందూ దేవాలయ భూములను, ఆలయాలను రక్షించాలి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 30:**బిజెపి ప్రతి సోమవారం ప్రజా సమస్యలను పీజీఆర్ఎస్ లో నివేదించే జనతా వారధిలో రాష్ట్రవ్యాప్తంగా హిందూ ఆలయాల భూమి సుమారు 4.7 లక్షల ఎకరాల లో 1.5 లక్షల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని, అభివృద్ధి పేరుతో ఎనిమిది వేల ఎకరాలు ప్రభుత్వం తీసుకుందన్నారు. శిథిలావస్థలో ఉన్న హిందూ ఆలయాల పునర్నిర్మాణం చేపట్టాలని బిజెపి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర . జాయింట్ కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ఆలయ భూములు అన్యాక్రాంతం కావడం సరికాదని వాటిని కాపాడటానికి భారతీయ జనతా పార్టీ ప్రయత్నిస్తుందని ప్రభుత్వం కామన్ గుడ్ ఫండ్ ద్వారా ఆలయ నిర్మాణాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనతా వారిది కన్వీనర్ కృష్ణంరాజు, యానాపు ఏసు, పడాల నాగరాజు, బివి రామారావు, నాగుల శివ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే సొసైటీ ధ్యేయం

- చైర్మన్ సూదిన గంగాధర్..
- దోసకాయలపల్లి పి ఏ సి ఎస్ మహాజన సభలో ఆర్థిక నివేదిక వెల్లడి..



**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 30:** కోరుకొండ మండలం దోసకాయలపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పిఎసిఎస్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని సొసైటీ చైర్మన్ సూదిన గంగాధర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సొసైటీ ప్రాంగణంలో చైర్మన్ అధ్యక్షతన జనరల్ బాడీ (మహాజన సభ) సమావేశం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ సీఈవో శివ అప్పలరాజు గత ఏడాదికి సంబంధించిన ఆర్థిక నివేదికను సభ్యులకు చదివి వినిపించారు. సంఘంలో మొత్తం 549 మంది సభ్యులు ఉండగా, వారి షేర్ ధనం రూ. 1,35,23,221 గాఉందన్నారు. వివిధ రుణాల వివరాలను ఆయన వెల్లడిస్తూ..క్రాప్ లోన్స్: రూ. 1,29,79,694

ాయూ లోన్స్:రూ. 4,25,84,300

ాు లోన్స్: రూ. 2,75,83,266

రైతు నేస్తం: రూ. 5,32,00,604

రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. భూమి అభివృద్ధి కోసం రూ. 10 లక్షలు, ఏప్రిల్ నుండి మార్చి వరకు కొత్తగా రూ. 1,79,31,000 రుణాలు మంజూరు చేశామన్నారు.

సకాలంలో చెల్లిస్తే రాయితీ:

చైర్మన్ సూదిని గంగాధర్ మాట్లాడుతూ.. పంట రుణాలు సక్రమంగా చెల్లించిన రైతులకు 3% వడ్డీ రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కొత్తగా ఎరువుల వ్యాపారం ప్రారంభించి 675 మంది రైతులకు సేవలు అందించామన్నారు. దీని ద్వారా సంఘానికి రూ. 46,270 లాభం చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన అన్ని సేవలను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.

పాల్గొన్న ప్రముఖులు:

ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు కర్రి రాజారావు, గల్లా శ్రీనివాస్, ప్రముఖ నేతలు మారిన రాము, మారిన బుజ్జి , గ్రామ సర్పంచ్ దారా యశోద రాంబాబు మరియు పెద్ద సంఖ్యలో సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# జిల్లా రైతులకు అందుబాటులో 9 నూతన గోదాములు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 30 :**తూర్పు గోదావరి జిల్లాలోని రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా నాబార్డు నిధుల సహాయంతో నిర్మించిన 9 నూతన గోదాములు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చినట్లు జిల్లా సహకార అధికారి యం.వెంకట రమణ, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్

తెలిపారు. గతంలో ఈ గోదాములు అందుబాటులో లేక రైతులు తమ పంట దిగుబడిని తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వచ్చేదని, ఇప్పుడు ఈ వసతి కల్పించడం ద్వారా రైతులు ధాన్యం, ఆరుతడి పంటలను సురక్షితంగా నిల్వ చేసుకుని, మార్కెట్‌లో మద్దతు ధర లేదా లాభదాయకమైన ధర లభించినప్పుడు విక్రయించుకోవచ్చునన్నారు.

ఈ క్రమంలో తాళ్ళపూడి మండలంలోని అన్నదేవరపేట (500 ఎం టి), దేవరపల్లి మండలం లోని , దేవరపల్లి సొసైటీ పరిధిలోని రామన్నపాలెం (500 ఎం టి ), రాజానగరం మండలం లోని కానవరం సొసైటీ పరిధిలోని రాజానగరం (500 ఎం టి), నల్లజర్ల మండలం లోని నల్లజర్ల సొసైటీ పరిధిలోని నల్లజర్ల (500ఎం టి ), దూబచెర్ల (500ఎం టి ), తేలికిచెర్ల (500ఎం టి ), రాజమహేంద్రవరం (రూరల్ ) మండలంలోని హుకుంపేట (500ఎం టి ), దేవరపల్లి మండలం లోని కురుకూరు సొసైటీ పరిధిలోని పల్లంట్ల (500 ఎం టి), కొవ్వూరు మండలం లోని దొమ్మేరు (500ఎం టి-) లలో నిర్మించిన గోదాములను రైతులు తక్షణమే వినియోగించుకోవచ్చునన్నారు.

పంట నిల్వ చేయదలచిన రైతు లు సంబంధిత ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈఓ (ని సంప్రదించి అవసరమైన వివరాలు పొందాలని అధికారులు సూచించారు. సంబంధిత సహకార సంఘాలకు జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసిందన్నారు. రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఈ భారీ నిల్వ సామర్థ్యం గల గోదాములను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.

# రామకృష్ణ మిషన్ సేవలు అభినందనీయం



- 200 మందికి చీరల పంపిణీ
- రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి

**గంగవరం రంపచోడవరం, పెన్ పవర్ మార్చి 30:**

రామకృష్ణ మిషన్ మిషన్ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు అందజేస్తున్న సేవలు అభినందనీయమని రంపచోడవరం శాసనసభ్యురాలు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ మిరియాల శిరీష దేవి అన్నారు. రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో సోమవారం సిరిగిందలపాడు గ్రామంలోని రామకృష్ణ మిషన్ వైద్యశాలలో దివ్య జనని శ్రీ శారదాదేవి శుభాగమన దినోత్సవం (ఏప్రిల్ 2) పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిగిందలపాడు, ఇర్లపల్లి, పందిరిమామిడి, గోగుమిల్లి, బందపల్లి, రాజపూడి, రంపచోడవరం, గోకవరం, గంగవరం మండలాలకు చెందిన సుమారు 200 మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగ మహిళలకు సుమారు రూ.2 లక్షల విలువైన చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ మాట్లాడుతూ, శారదా మాత జగన్మాత కాళికామాత అవతారమని, ఆపదలో ఉన్న వారికి తల్లిలా ఆశ్రయం కల్పించడమే మిషన్ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన అందరికీ అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో





రామకృష్ణ మఠం రాజమండ్రి బ్రహ్మచారులు జానకీశ చైతన్య, ఇష్టచైతన్య, డాక్టర్ టి.వి. సుబ్బారావు, భక్తులు పి. బాబూరావు, శ్రీనివాస్, వాలంటీర్లు సాయి ఫణికుమార్, వి. నాగేశ్వరరావు (విశ్రాంత ఉపాధ్యాయులు), భగీరథ రాజు, వినయ్, కోట్ల మంగిరెడ్డి, వైద్య సేవల సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# రాజమహేంద్రవరంలో టిడ్కో గృహప్రవేశాలు

### లబ్ధిదారులకు శాసన సభ్యులు గోరంట్ల అందజేత



**రాజమహేంద్రవరం పెన్ పవర్, మార్చి 30**


రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా కీలక ముందడుగు వేస్తూ, రాజమహేం ద్రవరం పరిధిలో రూ.494 కోట్ల వ్యయంతో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేసిమని రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో భాగంగా, రాజమహేంద్రవరం సమీపంలోని నామవరం శాటిలైట్ సిటీలో సోమవారం ఈ గృహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొని లబ్ధిదారులకు గృహ పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో, నాణ్యమైన నిర్మాణంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించిన ఈ గృహ సముదాయాలను సోమవారం లబ్ధిదారులకు నామవరం లో అధికారికంగా అప్పగించారు. ఈ సముదాయాల్లో అంతర్గత రహదారులు, త్రాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఈ గృహ సముదాయానికి సమీపంలోనే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, లబ్ధిదారులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేర్పించాలని సూచించారు. త్వరలో జలజీవన్ మిషన్ ద్వారా గోదావరి నీటిని ప్రతి ఇంటికి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సముదాయంలో చౌకధర దుకాణం అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. 300 చదరపు అడుగుల విభాగంలో లబ్ధిదారులపై ఎటువంటి భారం లేకుండా ప్రభుత్వం పూర్తి వ్యయాన్ని భరించగా, 365, 430 చదరపు అడుగుల విభాగాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు లబ్ధిదారుల తక్కువ వాటాతో బ్యాంకు రుణ సదుపాయంతో ఇళ్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వివరించారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ గృహ సముదాయాలను నిర్మించాయని తెలిపారు. ఈ గృహాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనందున లబ్ధిదారులు వెంటనే గృహప్రవేశాలు చేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ, ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఈ గృహ నిర్మాణాలను పూర్తి చేసి అందజేసిందన్నారు. అడిషనల్ కమిషనర్ టీవీ రామలింగేశ్వర్ మాట్లాడుతూ, షియర్ వాల్ టెక్నాలజీతో ఈ గృహాల నిర్మాణం చేపట్టడం వల్ల బలమైన నిర్మాణ నాణ్యత సాధ్యమైందన్నారు.

ఈ కార్యక్రమంలో రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్యేటి ప్రసాద్, , గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యామన నారాయణ గౌడ్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానపు యేసు, దాలిపర్తి వేమన, నిచ్చినకోళ్ళ సత్తిబాబు, ఎమ్మెస్సార్ శ్రీను, బైరెత్తి సరోజినీ దేవి, చౌడాడ లాజర్, కురుసపూడి నాగేంద్రబాబు, సునీల్, మజ్జి సాయి, నాగబాబు, అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

### పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం" లో 27 ఫిర్యాదులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్,మార్చి 30:**రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం", (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని సోమవారం తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచారు. పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం" కార్యక్రమానికి 27 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు.


# సీజ్ చేసిన వాహనాల బహిరంగ వేలం లో రూ.10 లక్ష ల ఆదాయం



**– జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 30** :తూర్పు గోదావరి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో పన్ను బకాయిలు , ఫిట్‌నెస్ , పర్మిట్ లేని , నిర్బంధించిన వాహనాలను సోమవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్ సోమవారం తెలియ చేశారు. ఈ వేలం ప్రక్రియ పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించినట్లు జిల్లా రవాణా అధికారి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కేటగిరీలకు చెందిన మొత్తం 36 వాహనాలను వేలం వేయగా రూ. 10,06,600/- వసూలు చేసినట్లు జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ వెల్లడించారు. ప్రభుత్వానికి రావలసిన బకాయిల వసూళ్లలో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. వాహన యజమానులు తమ వాహనాలకు సంబంధించిన పన్నులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు నిబంధనలను సమయానికి పూర్తిచేయాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రవాణా శాఖ తరఫున భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు, చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించడంలో భాగంగా చేపడుతున్న చర్యలకు ప్రజలు సహకరించాలని జిల్లా రవాణా అధికారి కోరారు.


### పీఎం జన్మన్ గృహప్రవేశాలకు కూటమి నాయకులు రిబన్ కటింగ్






**చింతూరు, పెన్ పవర్ మార్చి 30:**ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం జన్మన్ పథకంలో భాగంగా నిర్మించిన పక్కా గృహాల గృహప్రవేశాలను టిడిపి మండల అధ్యక్షులు జమాల్ ఖాన్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. చింతూరు మండలంలోని మోతుగూడెం గ్రామంలో నైనా శాంతమ్మ గృహాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పేదలకు స్థిర నివాసాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ద్వారా చింతూరు డివిజన్ పరిధిలో మొత్తం 183 హౌసింగ్ కాలనీలు నిర్మాణంలో ఉండగా, వాటిలో 80 కాలనీలు పూర్తయ్యాయి. మిగతా కాలనీలలో 33 గృహాలు స్లాబ్ స్థాయిలో ఉండగా, మరో 70 గృహాలు బేస్ లెవల్ దశలో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ పీఎం జన్మన్ పక్కా గృహాల పథకం దేశంలోని పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారికి గృహ సౌకర్యం కల్పించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసా కమిటీ సభ్యులు, జనసేన నాయకులు తీగల రవి, వీర మహిళా తీగల కవిత ఎంపీటీసీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ ఏఈ, వర్క్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న ప్రజా ప్రతినిధి, అధికారులు





**అక్రమంగా నిర్మించిన గౌతమి బిల్డింగ్ ను కూల్చివేయాలని హైకోర్టు ఆదేశం**

**హైకోర్టు ఆదేశాలు పాటించాలని పిజిఆర్ఎస్ లో మాజీ ఎంపీ మార్గాని భరత్ వినతి పత్రం అందజేత**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 30:** నగరంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా , ప్రజలకు ప్రమాదకరంగా అక్రమ భవన నిర్మాణాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని, అక్రమ నిర్మాణాలతో ఇవీఎం ఎమ్మెల్యే పండగ చేసుకుంటున్నారని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ముడుపుల మత్తులో తేలుతున్నారని వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ విమర్శించారు. దేవి చౌక్ సమీపంలో పశువుల ఆసుపత్రి ఎదుట గౌతమి బిల్డింగ్ జి ప్లస్ ఫోర్ లో నిబంధనలను అతిక్రమించి అక్రమంగా నిర్మించారని, ఈ భవనాన్ని కూల్చివేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు పరచాలని కార్పొరేషన్ సిటీ ప్లానర్ జీవీ వి ఎస్ మూర్తిని కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన పి జి ఆర్ ఎస్ లో ఈ మేరకు వైసీపీ పార్టీ శ్రేణులతో కలిసి భరత్ ఆయనకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలు, ప్లాను ప్రకారం భవన నిర్మాణం జరగలేదని, సెట్ బ్యాక్ లేవని, పార్కింగ్ లేదని, భవిష్యత్తులో ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని, నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారని సి పి ను ప్రశ్నించారు. భరత్ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం చెప్పలేక తప్పించుకునే దోరణిలో సిపీ మాట్లాడుతూ, బిపిఎస్ పథకం అమల్లో ఉందని, ఆదేశాలు హైకోర్టు ఆదేశాల్లో పేర్లు మారాయని, గ్రౌండ్ ఫ్లోర్ లో షాపులు షాపులు మూసివేసామని పొంతన లేని సమాధానాలు చెప్పడంతో తాము హైకోర్టులోనే తేల్చుకుంటామని ఆయనకు వినతి పత్రం అందజేసారు.

**అక్రమ నిర్మాణాలను జరిగితే ఇవిఎం ఎమ్మెల్యేకు పండుగే...**

కార్యాలయం బయట మీడియాతో మాట్లాడుతూ, నగరంలో ఎక్కడైనా అక్రమ నిర్మాణాలను జరిగితే ఇవి ఎం ఎమ్మెల్యేకు పండుగేనని, వెంటనే అతని అనుచరులు రాబందుల్లాగా వాలిపోయి లక్షల రూపాయలు ముడుపులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిర్మాణం సైజును బట్టి ఐదు లక్షల నుంచి 50 లక్షల వరకు ముడుపులు వసూళ్ళు చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలను నియంత్రించాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ముడుపులు మత్తులో పడి ఆక్రమణదారులను ప్రోత్సహిస్తున్నారని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని భరత్ విమర్శించారు. నగరంలో వందలాది అక్రమ భవన నిర్మాణాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని జరుగుతున్నాయని నీటి వైపు కనీసం కన్నెత్తి చూసిన ప్రజా ప్రతినిధులు గాని , అధికారులు గానీ లేరన్నారు.
నిత్యం రాకపోకలు సాగించే కమిషనర్ తో సహా అధికారులకు ఈ అక్రమ బిల్డింగ్ కనిపించలేదా అని ప్రశ్నించారు. ఈ బిల్డింగ్ జి ప్లస్ ఫోర్ లో , ఎటువంటి సెట్బాక్ లు లేవని, భవిష్యత్తులో ఏవైనా ప్రమాదాలు జరిగితే ఎవరిది బాధ్యత అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్డింగ్ అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని మహమ్మద్ ఉస్మాన్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. కార్పొరేషన్ అధికారులు విచారణ జరిపి నిర్మాణం అక్రమమని నిర్ధారణ చేసినట్లయితే చర్యలు తీసుకోవచ్చని ఆదేశించినట్లు భరత్ తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్థానిక ప్రజా ప్రతినిది వత్తిడికి లొంగి యజమానిపైన గాని , అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇదే బిల్డింగ్ ల్డింగ్ వ్యవహారంలో తాను ఐదు కోట్లు లంచాలు తీసుకున్నానని నగరమంతా కరపత్రాలు ముద్రించి పంపిణీ చేసి విష ప్రచారం చేశారని ఈవీఎం ఎమ్మెల్యే అన్యాయంగా గెలిచారని ఎద్దేవా చేసారు. నిబంధనల ప్రకారం 22 శాతం పార్కింగ్ ఉండాలని సెట్ బ్యాక్ లు ఉండాలని, ఓపెన్ స్థలం ఉండాలని అయితే ఇవన్నీ ఎక్కడ కనిపించమన్నారు. నిబంధనలను అతిక్రమించిన బిల్డింగ్ యజమాని పైన చర్యలు మానేసి బీపీఎస్ పథకం అమల్లో ఉందని యజమానులకు వత్తాసుగా పలుకుతున్న కార్పొరేషన్ అధికారుల తీరు పి ఆయన మండిపడ్డారు. ఎన్నికల ముందు తనపై చేసిన లంచాల ఆరోపణలు ఈవీఎం ఎమ్మెల్యే నిరూపించాలని, లేదంటే రాష్ట్ర ప్రజలకు బేషరతగా క్షమాపణ చెప్పాలని, అదే బిల్డింగ్ వద్ద నిలబడతానని నిరూపించినట్లైతే తాను క్షమాపణ చెప్తానని భరత్ సవాల్ చేశారు. మున్సిపల్ కమిషనర్ కు చిత్తశుద్ధి ఉంటే నిబంధనలు అతిక్రమించిన అక్రమ బిల్డింగులపై చర్యలు తీసుకోవాలని చేశారు. నగరంలో అధికారులు తీరు ప్రజాస్వామ్యపు స్ఫూర్తికి, రాజ్యాంగానికి, ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉందని విమర్శించారు. ఎమ్మెల్యే తండ్రి, మాజీ ఎమ్మెల్సీ దళితుల్ని కించపర్చిన కేసులో ఆదిరెడ్డి అప్పారావు పై పోలీస్ కేసు నమోదు చేస్తే బాధితులకు ప్రాథమిక హక్కుగా ఇవ్వవలసిన రసీదును ఒక సర్కిల్ ఇన్స్పెక్టర్ నిరాకరించడం రాష్ట్రంలో పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం అవుతుందన్నారు.
క్రెడిట్ చోరీ చేయడంలో దేశంలో చంద్రబాబును మించిన వారు లేరని, రాష్ట్రంలో ప్రస్తుతం వచ్చిన పోర్టులు, పరిశ్రమలు గత జగన్ హయాంలో వచ్చినవేనని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. భరత్ వెంట పార్టీ శ్రేణులు మహిళలు తదితరులు ఉన్నారు

# పోలవరం జిల్లాలో పి--4 వార్షికోత్సవం ఘనంగా





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 30 :**పోలవరం జిల్లాలో పి--4 వార్షికోత్సవాన్ని సోమవారం సాయంత్రం స్థానిక ఐటిడిఎ పీఓ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు భారీగా హాజరై విజయవంతం చేశారు. జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ చింతూరు, రంపచోడవరం ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన 2047 విజన్‌లో భాగంగా పి--4 కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. సమాజంలో 10 శాతం మంది మార్గదర్శకులు ముందుకు వచ్చి, వెనుకబడిన 20 శాతం కుటుంబాలను దత్తత తీసుకుంటే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. 2026--27 బడ్జెట్‌లో పోలవరం జిల్లాకు రూ.3 వేల కోట్ల గ్రాంట్ కేటాయించడం శుభ సూచకమని అన్నారు. ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి దూరదృష్టితో పి--4 కార్యక్రమం అమలవుతోందని, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ఇది కొత్త దిశగా మారుతుందని తెలిపారు. ప్రతి కుటుంబాన్ని దత్తత తీసుకునేలా ప్రజలను ప్రోత్సహిస్తామని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దడం ప్రభుత్వ లక్ష్యమని, అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బుజ్జి రెడ్డి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు పి--4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేసి, గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కోరారు.

**మార్గదర్శకుల చొరవ:**

మార్గదర్శి సమ్మర్టన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వినయ్ మాట్లాడుతూ చింతూరు డివిజన్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరికరాలు అందజేసి రూ.40--50 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో లైటింగ్, మౌలిక సదుపాయాల కోసం సుమారు కోటి రూపాయలు వ్యయం చేసినట్లు చెప్పారు. కార్పొరేట్ సంస్థలు, దాతల సహకారంతో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. జమల్ ఖాన్ నేతృత్వంలో 70--80 బోర్లు త్రవ్వడం, బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం, గ్రామీణ రహదారుల మరమ్మత్తులు చేపట్టినట్లు వివరించారు. త్రిఫేజ్ విద్యుత్, వ్యవసాయ ప్రోత్సాహంతో ప్రజల జీవన విధానంలో మార్పు వస్తుందని, 2047 నాటికి పోలవరం జిల్లా ఆర్థికంగా బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
జాయింట్ కలెక్టర్ బొచ్చు స్మరణ్ రాజ్ పి--4 కార్యక్రమం లక్ష్యాలు, అమలు విధానాన్ని వివరించారు. లబ్ధిదారుల ఆనందం:
పి--4 ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని లబ్ధిదారులు తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో అందుతున్న సౌకర్యాలు గ్రామీణ ప్రజలకు నూతన ఆశలు నింపుతున్నాయని పేర్కొన్నారు. వర్చువల్ కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి ప్రసంగం ప్రసారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, ఐటిడిఎ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాలు, యువజన సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సొంత ఇల్లు గౌరవం, సంతోషం కలుగుతుంది

- **టిడ్కో కాలనీని ప్రత్యేక పట్టణంగా అభివృద్ధి చేస్తాం :ఎమ్మెల్యే బొలిశెట్టి.**
- **జగన్ ట్రాప్ లోపడి గొడవలు పడవద్దని ఎమ్మెల్యే సూచన.**





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 30:** టిడ్కో గృహ సముదాయం ఉన్న ప్రాంతాన్ని, సకల మౌలిక సౌకర్యాలు కల్పించి ప్రత్యేక పట్టణంగా అభివృద్ధి చేస్తామని, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం, ఎల్ అగ్రహారం గ్రామంలో ఉన్న టిడ్కో గృహ సముదాయం లో సోమవారం లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని గృహప్రవేశాలు చేయించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ నివాసం ఉంటున్న వారందరికీ పట్టణంలో లభించే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇక్కడి గృహాలు కొన్ని దెబ్బతిన్నాయని, వాటిని బాగుచేయించి, పరిశుభ్ర వాతావరణం కల్పిస్తామన్నారు. కాలనీలో లిఫ్ట్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. వైసీపీ నాయకులు గృహ రుణాలు చెల్లించవద్దని తప్పుదోవ పట్టించారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వడ్డీ బకాయిలు చెల్లించి లబ్ధిదారులకు న్యాయం చేసిందన్నారు. ఈ కాలనీలో కుల మతాల బేధాలు లేకుండా కలిసిమెలిసి ఐకమత్యంతో ఉంటే ఒక ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దవచ్చని, అందుకు కాలనీవాసులు సహకరించాలని కోరారు. వివిధ పండుగలను కలిసికట్టుగా నిర్వహించి ఆదర్శంగా నిలవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుల మతాల మధ్య చిచ్చుపెట్టి, రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. జగన్ మాయలో పడి గొడవలు పడద్దని సూచించారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని, హిందూ ధర్మాన్ని పాటిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఎవరూ మతం మారవలసిన అవసరం లేదని, మన ధర్మమే మనల్ని కాపాడుతుందని అన్నారు. మనం పాపం చేస్తే, మతం మారినంత మాత్రాన ఏ దేవుడు క్షమించడని, కర్మ ఫలితం అనుభవించక తప్పదని అన్నారు. మతావిద్వేషాలను, అసత్య ప్రచారాలను సహించబోమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో, చంద్రబాబు అనుభవంతో, పవన్ కళ్యాణ్ నిజాయితీతో రాష్ట్రంలో భారీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని, ప్రజలు ఈ విషయాన్ని గ్రహించి ప్రభుత్వానికి అండగా నిలవాలని అన్నారు. జగన్ రాక్షస పాలననుంచి ఆంధ్ర రాష్ట్రానికి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో విదేశాల నుంచి కూడా లక్షల రూపాయలు ఖర్చు చేసి, టికెట్లు కొని,పోలింగ్ కేంద్రాలకు వచ్చి,ఓట్లు వేసి కూటమి ని గెలిపించారని అన్నారు. ప్రజల రుణం తీర్చుకునే విధంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. తాము వచ్చిన వెంటనే గత ఐదు సంవత్సరాలుగా విధ్వంసా నికి గురయిన అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టామని అన్నారు. శిథిలమైన రోడ్లన్నింటినీ తిరిగి నిర్మించామని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పెద్ద ఎత్తున వైద్య సహాయం అందిస్తున్నామన్నారు. ప్రతి ఎమ్మెల్యేకి, ప్రతి అధికారికి నిర్దిష్ట ప్రణాళికతో, ప్రజా సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు అప్పగించారని అన్నారు. ముఖ్యమంత్రి రూపొందించిన పి 4 విధానంలో పట్టణంలో ఈత కొలను, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా ప్రాంగణం అభివృద్ధి, ఇండోర్ స్టేడియం తదిత నిర్మాణాలు చేపట్టామన్నారు. తాడేపల్లిగూడెంలో సమర్థులైన అధికారులు ఉన్నారని వారి సహకారంతో అభివృద్ధి సాధిస్తామని ఎమ్మెల్యే అన్నారు.
ఈ కార్యక్రమంలో ఎల్ అండ్ టి అధికారులు మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, గొర్రెల శ్రీధర్, చేపల రమేష్, జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు, వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, ఆకాశపు స్వామి, దువ్వ శ్రీను, మద్దాల మణికుమార్, వాడపల్లి సుబ్బరాజు, పసల కొండ, పాలూరి వెంకటేశ్వరరావు, పసుమర్తి రామ లక్ష్మణ్, పట్నాల రాంపండు, నరిసే సోమేశ్వరరావు, నల్లగంచి రాంబాబు, గట్టం నాని, మలపాక చిట్టి, పిడుగు రామ్మోహన్ బ్రదర్, కూటమి నాయకులు పాల్గొన్నారు

## బలుసులమ్మ అమ్మవారిని దర్శించుకున్న నియోజకవర్గ వైకాపా ఇంచార్జి వడ్డి రఘురామ్.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మార్చి 30.**పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో పట్టణ ఇలవేల్పు శ్రీ శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయాన్ని నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు దర్శించుకున్నారు. ఆలయంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ మాట్లాడుతూ ఎంతో మహిమ గల గ్రామదేవత బలుసులమ్మ అమ్మవారన్నారు. 2014లో ఆనాటి స్థానిక దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు కృషితో బలుసులమ్మ అమ్మవారి నిర్మాణం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా జగన్మోహన్ రెడ్డి సహకారంతో స్థానిక దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చొరవతో అమ్మవారికి వెండి తాపడం, ఉయ్యాల, రథం నిర్మాణం, ఆలయ అభివృద్ధి పెద్దఎత్తున జరిగిందని గుర్తుచేశారు. ఆలయ అభివృద్ధికి తొలుత నుండి కూడా పట్టణ ప్రజలు ఎంతగానో సహకారం అందచేశారని, జాతరకు కూడా పెద్దఎత్తున విరాళాలు అందచేశారన్నారు. ప్రజల సహకారంతోనే ఆలయం అంగరంగ వైభవంగా విరజిల్లుతుందన్నారు. 2014 తరువాత 12ఏళ్లకు నిర్వహించే అమ్మవారి జాతర ఈ ఏడాది స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఎంతో ఘనంగా నిర్వహించారని కొనియాడారు. తాడేపల్లిగూడెం పట్టణ ప్రజలు అందరూ అమ్మవారిని వారి ఇంటి ఆడపడుచుగా భావిస్తారని, ఏ ఇంటిలో పెళ్లి జరిగినా అమ్మవారికి చలివిడి పానకాలు సమర్పిస్తారన్నారు. ఆలయ కమిటీ ఏంతో కష్టపడి అమ్మవారి కార్యక్రమాలు, జాతర ఎంతో చక్కగా చేయడం అభినందనీయమన్నారు.
ఆలయ నిర్మాణ దశ నుండి ఆలయ నిర్మాణానికి అభివృద్ధికి సహకరించిన వారిని, అప్పటి మంత్రి మాణిక్యాలరావు కుటుంబాన్ని, గత మంత్రి కొట్టు సత్యనారాయణను జాతర వేడుకల్లో ఆలయ కమిటీ సత్కరించి ఉంటే బాగుండేదని నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష అన్నారు. జాతరకు విరాళాలు ఇచ్చిన వారి పేర్లు వివరాలు మున్సిపల్ హోర్డింగ్ ద్వారా పెడితే ఇంకా బాగుండేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, పెంటపాడు మండల అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, వైసీపీ నాయకులు గుండుబోగుల నాగు, బూడి ప్రసాద్, కలిశెట్టి తాతరావు, మాకరాజు సతీష్, తానేటి అజయ్, అశోక్ రాజు, ములపర్తి అఖిల్, కిరణ్ రెడ్డి, దత్తు సాయి, సోమేశ్వరరావు, లంక రాజశేఖర్, గొబ్బిల అజయ్, నీలం నాగభూషణం, వెంకటేష్ రెడ్డి, రమేష్ రెడ్డి, వింజమూరి శ్రీనివాస్, కొల్లి డేనియల్, మద్దుకురి సత్యనారాయణ, విప్పరు ఆనందరావు, కండెల్లి రాజేష్ మరియు వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- **సోషల్ మీడియా సెల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పీవీ రమణ**





**గంగవరం, పెన్ పవర్, మార్చి 30:**నేటి డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సోషల్ మీడియా సెల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పీవీ రమణ సూచించారు. సోమవారం గంగవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గంగవరం ఎస్ఐ వెంకయ్య అధ్యక్షత వహించగా, సీఐ రమణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మార్గదర్శక సూచనలు అందించారు. పోలవరం జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు, రంపచోడవరం ఇంచార్జి ఏఎస్పీ బి. హేమంత్ పర్యవేక్షణలో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులకు సైబర్ నేరాల పద్ధతులు, వాటి నుంచి ఎలా రక్షించుకోవాలి అనే అంశాలపై వివరంగా తెలియజేశారు. అలాగే సోషల్ మీడియాలో అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు వంటి వాటిని పంచుకోవద్దని హెచ్చరించారు. బ్యాంక్ వివరాలు, వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. ఏవైనా సైబర్ మోసాలు ఎదురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నివారణ, పోక్సో చట్టంపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నారుల రక్షణకు సంబంధించిన చట్టాలు, శిక్షలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# పేదల సాధికారతే లక్ష్యంగా పీ 4 విధానం






**కమిషనర్ రాహుల్ మీనా**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 30:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "జీరో పావర్టీ - పీ4" (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్ షిప్) కార్యక్రమ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ లో సోమవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాహుల్ మీనా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత పీ4 కార్యక్రమ తొలి ఏడాది విజయాలను ఎల్ఈడీ స్క్రీన్ పై ప్రదర్శించారు. అనంతరం బంగారు కుటుంబాలు మార్గదర్శులతో పరస్పర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పేదల బతుకుల్లో వెలుగును నింపేలా పీ4 విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. బంగారు కుటుంబాలు అన్ని అంశాల్లో సాధికారత సాధించేలా మార్గదర్శులు దిశానిర్దేశం చేస్తుండటం సంతోషదాయకమన్నారు. నగరంలో 3,091 బంగారు కుటుంబాలను గుర్తించగా.. వారిలో 708 కుటుంబాలను నగరంలోని సంపన్నులు, పారిశ్రామిక వేత్తలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఉద్యోగులు, వ్యాపారులు దత్తత తీసుకున్నా రన్నారు. వివిధ రూపాల్లో పేదలకు సేవలు అందించే వారిని గుర్తించి.. వారందరిని పీ4 వేదిక మీదకు తీసుకురావాలన్నారు. మరింత మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములైతే నిరుపేదలకు ఆసరా దొరుకుతుందన్నారు. అనంతరం తిరుపతి సదస్సును వర్చువల్ గా వీక్షించారు. బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వడంలో ఆదర్శంగా నిలిచిన మార్గదర్శులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, మార్గదర్శులు, బంగారు కుటుంబాలు పాల్గొన్నాయి

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గృహాల పంపిణీతో పేదల సొంతింటి కల సాకారం



**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం పెన్ పవర్, మార్చి 30 :** రాష్ట్రంలో పేదల సొంతింటి కలను నిజం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ప్రతి పేద కుటుంబం తమ సొంత ఇంటిలో అడుగుపెడుతున్న ఈ క్షణం ప్రభుత్వానికి గర్వకారణమన్నారు.
గత 21 నెలల్లో మొత్తం 5.50 లక్షల ఇళు లబ్ధిదారులకు అందించామని ఎమ్మెల్యే వాసు వివరించారు. పీఎంఏవై అర్బన్ కింద 4.52 లక్షలు, పీఎంఏవై గ్రామీణ్ కింద 78 వేల ఇళ్లు, పీఎం జన్మాన్ కింద 20 వేల ఇళ్లు ఉన్నాయని తెలిపారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో 2014-2019 మధ్య కాలంలో 8 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించి ఇచ్చిన సంగతి గుర్తుచేశారు.
పీఎంఏవై అర్బన్ కింద సాయాన్ని రూ. 1.80 లక్షల నుంచి రూ. 2.50 లక్షలకు పెంచగా, గ్రామీణ్ కింద రూ. 2.39 లక్షలు అందిస్తున్నామని చెప్పారు. అదనంగా ఎస్సీ, బీసీ వర్గాలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, పీవీటీజీలకు రూ. 1 లక్ష అదనపు సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల కార్యక్రమం దెబ్బతిందని ఎమ్మెల్యే వాసు ఆరోపించారు. ఇళ్లు రద్దు చేయడం, బిల్లులు పెండింగ్ పెట్టడం వల్ల పనులు నిలిచిపోయాయన్నారు. కేంద్రం నిధులను సక్రమంగా వినియోగించలేదని మండిపడ్డారు.
2029 నాటికి మొత్తం 17.60 లక్షల ఇళ్లు నిర్మించి అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## ఎల్పిజి గ్యాస్ వినియోగదారుల కొరకై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

LPG గ్యాస్ వినియోగదారులకు
సమాచారం నిమిత్తం
**CONTROL ROOM**
**08864 243253**
పౌర సరఫరాల శాఖ, పోలవరం జిల్లా



జిల్లా పౌరసరఫరాల అధికారి విజయభాస్కర్

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 30:** పోలవరం జిల్లాలో ఎల్పిజి గ్యాస్ వినియోగదారుల సమాచారం రంపచోడవరంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పి విజయ భాస్కర్ తెలిపారు. జిల్లా పరిధిలో గల 12 మండలాల లో ఎల్పిజి గ్యాస్ కు ఎటువంటి కొరతలేదని ఆయన స్పష్టం చేశారు. ఎల్పిజి గ్యాస్ కు సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఫోన్ నెంబర్. 08864243253 లో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు సంప్రదించాలని ఆయన కోరారు.

## పేకాట రాయుళ్లపై పోలీస్ పంజా

ఏడుగురు నిందితులు అరెస్ట్


**సీతానగరం, పెన్ పవర్, మార్చి30:** సీతానగరం మండల పరిధిలోని లంకూరు గ్రామ శివారులో లంక ప్రాంతాలలో పామాయిల్ తోటల్లో పేకాటఆడుతున్నారని సమాచారం రావడంతో ఏడుగురు జూదరులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్సై బి. వినయ్ ప్రతాప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, రహస్య సమాచారం ఆధారంగా పోలీసులు దాడి చేసి, పేక ముక్కలు, రూ5,120 నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పేకాట, మద్యం, గంజాయి వంటి వ్యసనాలు గ్రామీణ సమాజంలో విస్తరిస్తూ కుటుంబాలనే దెబ్బతీస్తున్నాయని, రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు ఈ మాయాజాలంలో పడిపోవడం వల్ల అప్పులు, కుటుంబ కలహాలు, ఆత్మహత్యలు వంటి దారుణాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. . పోలీసులు తరచూ గ్రామాల్లోకి వెళ్లి అవగాహన కల్పిస్తున్న పేకాట సెంటర్లు రూపం మార్చుకుని మళ్లీ వెలుస్తుండటం ఆందోళనకర విషయం అని పేర్కొన్నారు. అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

## భూగర్భ జలాల అడుగంటిన మాట వాస్తవమే. జియాలజిస్ట్ రాధాకృష్ణ



**గోకవరం పెన్ పవర్ మార్చి 30:--** గుమ్మల దొడ్డిలోని ఉన్న భూగర్భ జలాలు అడుగంటిపోయిన మాట వాస్తవమే అంటూ జియాలజిస్ట్ రాధాకృష్ణ రైతులకు స్పష్టం చేశారు. గతవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ లో ఈనెల 23వ తేదీన గుమ్మలదొడ్డి గ్రామానికి చెందిన సత్యం ప్రకాష్ రావు అనే రైతు... అసాగో పరిశ్రమలో విచ్చలవిడిగా విద్యుత్ మోటర్లను వినియోగించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయి తన పొలంలో ఉన్న బావి ఎండిపోవడంతో పాటు విద్యుత్ మోటార్ నుంచి నీరు అందడం లేదని ప్రజాదర్బాల్లో ఫిర్యాదు చేయడం జరిగింది దీంతో సోమవారం భూగర్భ జల శాఖకు చెందిన జియాలజిస్ట్ రాధాకృష్ణ సంబందింత రైతు పొలాన్ని పరిశీలించడం జరిగింది గతంగంటే ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటడం వాస్తవమేనని రైతులు వద్ద ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించడం జరిగింది.

## జల జీవ మిషన్ లో అసంపూర్తి నిర్మాణాలు



తెలిసిన పట్టించుకోని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు

**వై రామవరం, పెన్ పవర్, మార్చి 30 :** మండలంలో జల జీవ మిషన్లో భాగంగా ఇంటింటికి కులాయి ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం కల నిర్వీర్యం అయిందని చెప్పక తప్పదు.
వివరాల్లోనికి వెళ్తే కేంద్ర ప్రభుత్వం ద్వారా జల జీవ మిషన్ లో ప్రతి పంచాయతీలో లక్షలాది రూపాయల కాంట్రాక్టర్లు పనులు చేపట్టారని స్థానికులు తెలిపారు. లక్షలాది రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అవుతున్న అటు పంచాయతీ సిబ్బంది, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికుల ఆరోపిస్తున్నారు. ఇంటింటికి కులాయి అనే పథకం పూర్తిస్థాయిలో నెరవేరలేదని అంటున్నారు. అసంపూర్తి నిర్మాణాలతో ప్రభుత్వ కల నెరవేరలేదని స్థానికులు అంటున్నారు. ఈ విషయమే ఆర్డబ్ల్యూఎస్ జె ఇ వివరణ కోరుటకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

## అమ్మమ్మ ఊరికి బ్రిడ్జి నిర్మించమని జిల్లా కలెక్టర్ గారిని వేడుకొన్న పదవ తరగతి చదువుతున్నగిరిజన విద్యార్థి ... క్రిషి వసంత్ .



**అడ్డతీగల, పెన్ పవర్, మార్చ్ 30:** అడ్డతీగల మండలం ధాన్యం పాలెం బిచిన్న మునకన గడ్డ గ్రామాల మధ్య చంద్రా కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి 6 సంవత్సరాలు నుండి అసంపూర్తిగా ఆగిపోయి ఉందని,
పోలవరం జిల్లా నూతన కలెక్టర్ దినేష్ కుమార్ ను గ్రీవెన్స్ లో కలిసి బ్రిడ్జి నిర్మాణము పూర్తి చేయమని వేడుకోగా సానుకూలంగా స్పందించి సత్వరమే పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.
వివరాల్లోకి వెళితే కింటుకూరి. క్రిషి వసంత్ వై.రామవరం మండలం కోట గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి , నవోదయ పెద్దాపురంలో ఇటీవల పదవ తరగతి పరీక్షలు పూర్తి చేసుకొని వచ్చి, అందరిలా కాకుండా తన అమ్మమ్మ గారి ఊరికి ఎంతో కాలంగా బ్రిడ్జి లేకపోవడం వల్ల విద్యార్థులు, ప్రజలు ,రైతులు ఇబ్బందులు పడుతున్నారని , నేను కూడా మా అమ్మమ్మ ఊరు వెళ్ళడానికి చాలాసార్లు ఇబ్బంది పడ్డానాని, జిల్లా కలెక్టర్ కి పబ్లిక్ గ్రీవెన్స్ లో వేడుకొన్నాడు.
చిన్న వయసులోనే తన ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు అధికారుల దృష్టికి తీసుకుని వచ్చినందుకు , అక్కడున్న అధికారులు, ప్రజలు క్రిషీ వసంత్ కి అభినందనలు తెలియజేశారు.

## గద్దెకు మార్గదర్శి ప్రతిష్టాత్మక అవార్డు రాజానగరం తెలుగుదేశం పార్టీ శ్రేణులు హర్షం:



**సీతానగరం, పెన్ పవర్, మార్చి 30:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మార్గదర్శి బంగారు కుటుంబం స్వర్ణాంధ్ర 2047కు గాను రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం యువ నాయకుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి) పీ4లో మార్గదర్శి ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆర్డీవో చేతుల మీదుగా సోమవారం శ్రీ కన్వెక్షన్ హాల్ వద్ద పురస్కారం అందుకోవడం తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం మండలం వంగలపూడి స్వగ్రామంలో పలు పేదవర్గాలను వెంకటకృష్ణ చౌదరి దత్తత తీసుకుని ఆయా కుటుంబాలు జీవన పరిస్థితులు మెరుగుపడేలా చేసిన కృషికి వెంకటకృష్ణ మార్గదర్శిగా నిలిచారు. కూటమి పార్టీ ఆశయాలను ప్రజల్లోకి నిత్యం తీసుకెళ్ళుతూ అన్నివర్గాల్లోను వివాదస్పద రహితుడగా పేరు సాధించిన గద్దె వెంకటకృష్ణ చౌదరికి అవార్డు రావడంఅభినందనీయమంటున్నారు. పీ-4లో అవార్డు రావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కు , మంత్రి నారా లోకేష్ కు, ఎమ్ పీ పురందేశ్వరికి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు, రాజానగరం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి, రుడా ఛైర్మెన్ బొడ్డు వెంకటరమణ చౌదరికి, కూటమి శ్రేణలకు అవార్డు గ్రహీత గద్దె వెంకటకృష్ణ చౌదరి కృతజ్ఞతలు తెలిపారు. పేద ప్రజలను దత్తతు తీసుకునేలా ప్రోత్సహించిన ఉద్యోగాలను వెంకటకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల ఎంపీడీవోలు, పి ఫోర్ సిబ్బంది , ఆర్డీవో తదితరులు పాల్గొన్నారు.

# పేదల 'సొంతింటి' కల సాకారం





- రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల గృహ ప్రవేశాలు
- రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 30:**పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. సోమవారం రంపచోడవరం మండలం భీరంపల్లి గ్రామంలో సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండో విడతలో భాగంగా ఏకకాలంలో 2.5 లక్షల గృహ ప్రవేశాలను నిర్వహించడం ద్వారా పేదలకు ఇళ్ల కలను నిజం చేస్తున్నామని పేర్కొన్నారు. పోలవరం జిల్లా వ్యాప్తంగా పీఎం-జన్ మన్ పథకం కింద 367 గృహాలు, పీఎం-ఏవై కింద 24 గృహాలు కలిపి మొత్తం 391 గృహాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శిరీషాదేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జిరెడ్డి, ఐటిడిఎ పీవో బచ్చు స్మరణ రాజు సంయుక్తంగా ప్రారంభించారు. లబ్ధిదారులతో మాట్లాడిన ఆమె వారి ఆనందాన్ని ప్రత్యక్షంగా చూసినట్లు తెలిపారు.

**21 నెలల్లో 5.50 లక్షల ఇళ్లు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 21 నెలల్లోనే మొత్తం 5.50 లక్షల ఇళ్లను పేదలకు అందజేసిన ఘనత సాధించిందని ఎమ్మెల్యే తెలిపారు. గత సంవత్సరం నవంబర్‌లో 3 లక్షల ఇళ్లను అందించగా, ఇప్పుడు రెండో విడతలో భాగంగా 1 లక్ష టిడ్కో ఇళు ,, 1.50 లక్షల గృహాలను లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతిల్లు అందే వరకు కృషి కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి, ఐటిడిఎ పీవో బచ్చు స్మరణ రాజు, క్లస్టర్ ఇంచార్జి కారం సింహాచలం, సర్పంచ్ నూకరాజు, పూల మంగేశ్వరరావు, కారం వెంకటేశ్వర్లు, కోసు నాగన్నదొర, చోడి నూకరాజు, కూర రమణమ్మ, బాపన్న దొర, ఈకా బుల్లి కొండలు దొర, కుర్ల రాజశేఖర్ రెడ్డి, వినోద్, కేఎల్ఎన్జీ వరప్రసాద్, గృహ నిర్మాణ శాఖ ఈఈ ఏ. రవికుమార్, డీఈ శ్రీరామచంద్రమూర్తి, ఏఈ బి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పేదగిరిజన కుటుంబాన్ని ఆదుకోండి



- వై.సి.పి.యూత్,నాయకులు సోడిచిరంజీవి

**వి.ఆర్.పురం**
**పెన్.పవర్.మార్చి.30:**మండలంలోని కొత్తూరు గ్రామానికిచెందిన కెచ్చల భీమి రెడ్డి కుమార్తె,ఆడుకొనుచుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతోనడుము విరిగిపోవడం జరిగిందని,వై.సి. పి.యూత్,నాయకులు తెలిపారు.ఈవిషయం తెలుసు కున్న వై.సి.పి.యూత్,నాయకులు సోడిచిరంజీవి సోమ వారం కెచ్చల భీమిరెడ్డి,కుటుంబానికి వెయ్యి రూపాయలు ఆర్థికసహాయం చేశారు.ఈ సమస్యను గ్రూపులో పెట్టిన వెంటనే స్పందించిన ఇద్దరు ధాతలు కర్నూలు నుండి ఒకరు,కలమాల హేమంత్,హుసేన్,అయిదు వందల రూపాయలు,మైలవరం నియోజకవర్గం నుండినాటూరి వెంకట్,వై.సి.పి.పార్టీ బి.సి.సెల్,సెక్రటరీ,కూడాఅయిదు వందలరూపాయలు సోడిచిరంజీవి,ఫోన్,పేకువేసి ఆకు టుంబానికి అందజేయమని,కోరారు.కెచ్చల భీమిరెడ్డి,కు సంతానం నలుగురు,అందరూ చిన్న పిల్లలు కావడంతో ఒక్కరేకూలి పనులుచేసి, ఆకుటుంబాన్ని,పోషించు కుటుం న్నాడు.ఇలాంటి సమయంలో ఆకుటుంబానికి ఇలా జరగ డం చాలా బాదాకరం విషయం అంటూ పలువురు ఆరో పిస్తున్నారు.కెచ్చల భీమిరెడ్డి,కుటుంబాన్ని,ఏడు సంవత్స రాల వయస్సుగల పాపను,ధాతలు ఎవరైనా ఉంటే ఆర్థిక సహయంచేసి,ఆదుకోవాలని,వి.ఆర్.పురం వై.సి.పి.యూ త్,నాయకులు సోడిచిరంజీవి,కోరారు.మానవతా దృక్ప థంతో ఆర్థిక సహాయం చేయండి.పేదగిరిజన కుటుంబాన్ని ఆదుకోండి,అంటూ ఒక ప్రకటనలో తెలిపారు.ఆర్థిక సహా యం చేసేవారు,సోడిచిరంజీవి ఫోన్,పే,నెంబర్,కు నగదు వేయండి.ఆ కుటుంబానికి అందజేయడం జరుగుతుంది. 950285 1486

## ఎమ్మెల్యే బెందళం అశోక్‌పై అట్రాసిటీ కేసు పెట్టాలంటూ ఆదివాసి జేఏసీ డిమాండ్



**చింతూరు, పెన్ పవర్ మార్చి 30:**చింతూరు డివిజన్ కేంద్రంలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందళం అశోక్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ సమస్యలను వివరించేందుకు ఎమ్మెల్యేను కలిసిన ఆదివాసి నాయకులను అవమానకరంగా దూషించడం ప్రజాప్రతినిధికి తగిన చర్య కాదని విమర్శించారు. వెంటనే ఆయనను ప్రభుత్వ విప్ పదవి నుండి తొలగించాలని కోరారు. అలాగే, ఒడిశా రాష్ట్రం నుండి వలస వచ్చిన కొంతమంది నాన్ ట్రైబల్స్‌ను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే నకిలీ సర్టిఫికెట్లతో కొందరు ఎస్టీగా చలామణి అవుతున్నారని, దీనివల్ల అసలైన ఆదివాసీల హక్కులు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే తన అధికారాన్ని దుర్వినియోగం చేసి వేలాది నాన్ ట్రైబల్స్‌ను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ, వెంటనే ఆయనపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో చింతూరు మండల జేఏసీ చైర్మన్ పొడియం రామకృష్ణ, డివిజన్ ప్రచార కార్యదర్శి సోడి శ్రీను, కాకా సీతారామరయ్య, మడివి రాజు, గోరేం రాఘవ, మడకం బోజ్జి, మడకం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రంప యర్రంపాలెం గ్రామంలో పలు కుటుంబాలకు "కంబాల" చేయూత

40,000 రూపాయలు ఆర్థిక సహాయం, 200 కిలోల బియ్యం పంపిణీ



**గోకవరం పెన్ పవర్ మార్చి 30:--** మండలంలోని రంపయర్రం పాలెం గ్రామంలో పలు కుటుంబాలను విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు గారు చేయూత అందించి ఆదుకున్నారు. గ్రామానికి చెందిన రాకుదిటి లక్ష్మీ నారాయణ ఒక ప్రమాదంలో కాలు విరిగిపోయింది. అతనికి కంబాల శ్రీనివాసరావు 5,000 రూపాయలు, 25 కిలోలు బియ్యం ఇచ్చి అధైర్య పడద్దని భరోసా ఇచ్చారు. అలాగే తులసి సత్యనారాయణ భార్య వీర లక్ష్మీ ఇటీవలే చని పోయింది. అతని కుటుంబ సభ్యులకు 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యం అందజేశారు.
బొల్లం వెంకటలక్ష్మి టీవి వ్యాధితో బాధపడుతుంది. ఆమెకు 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యం అందజేశారు. పోలుమాటి రాణి భర్త దుర్గారావు ఇటీవలే మృతి చెందాడు. ఆమె కుటుంబానికి 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యం అందజేశారు. ఈరెళ్ల అశ్విని కుమారుడికి రెండు చెవులు లేవు అతినికి 5,000 రూపాయలు, 25 కీలోల బియ్యం అందజేశారు. యడారి వెంకాయమ్మ ఇటీవలే మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులకు 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యంఇచ్చారు. అంకం భర్తయ్య పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. అతినికి 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యం అందించారు. గుర్రం జ్యోతి గర్భవతి ఆమెకు బంధువులు ఎవరూ లేరు. ఒంటరిగా జీవిస్తుంది. ఆమెకు 5,000 రూపాయలు, 25 కిలోల బియ్యాన్ని కంబాల శ్రీనివాసరావు అందజేసి ఆదుకున్నారు.
వీరందరికీ సోమవారం సాయంత్రం గ్రామానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను రామసేన సభ్యులు పరామర్శించి, కంబాల శ్రీనివాసరావు ప్రకటించిన నగదు బియ్యాన్ని వారికి అందజేశారు. ఈ కార్యక్రమం లో కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాల మణిరత్నం, పెద్దాడ వెంకన్న దొర, కాళ్ళ బుజ్జి, గంటా రాధాకృష్ణ, బత్తిన రామకృష్ణ, కాకర దుర్గారావు, కత్తుల వెంకటేశులు కత్తుల చంటిబాబు ఇచ్చిన నరేంద్ర గ్రామస్తులు, రామసేన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రంపచోడవరం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం





**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, మార్చి 30:**రంపచోడవరం నూతన బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. న్యాయవాదుల సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా మాదే బాల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఏలూరి పాపారావు, జనరల్ సెక్రటరీగా శివరంజని, జాయింట్ కార్యదర్శిగా రవితేజ, ట్రెజరర్ గా .గౌరీ శంకర్, మహిళ ప్రతినిధిగా వి. చక్రికా సభ్యులతో కూడిన నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీకి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రంపచోడవరం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మురళి గంగాధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, న్యాయవాదుల సమస్యలు మరియు పోలవరం జిల్లాలోని పలు న్యాయ సంబంధిత అంశాలపై చర్చించారు.
న్యాయవాదుల ఐక్యతకు ఈ ఎన్నికలు నిదర్శనంగా నిలిచాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంవి ఆర్ ప్రకాష్, మరి బాబ్జి, జిలాని, ప్రభుదాస్, కోలా సత్యప్రసాద్, శ్రీధర్, రమణ, దత్తు న్యాయవాదులు పాల్గొన్నారు

## చట్టి గ్రామపంచాయతీలో చివరి పాలకవర్గ సమావేశం

సభ్యులకు సన్మానం



**చింతూరు పెన్ పవర్ మార్చి 30:**చట్టి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం గ్రామ సర్పంచ్ రవ్వ భద్రమ్మ అధ్యక్షతన చివరి పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సర్పంచ్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులకు చిరు సన్మానం చేశారు. అనంతరం వార్డు సభ్యులు, పెసా కమిటీ సభ్యులు కలిసి సర్పంచ్ రవ్వ భద్రమ్మను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవ్వ భద్రమ్మ మాట్లాడుతూ గత ఐదేళ్లలో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. నిధుల లభ్యతను బట్టి 2026, 27 గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో కొన్ని సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించామని, అవి వచ్చే ఆర్థిక సంవత్సరంలో పరిష్కారమవుతాయని వెల్లడించారు. ఉప సర్పంచ్ తుర్రం రాముడు మాట్లాడుతూ పదవీకాలం పూర్తయినప్పటికీ వార్డు సభ్యులు తమ తమ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి కొనసాగించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ అలీ గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పెసా కమిటీ ఉపాధ్యక్షులు తుర్రం చిన ముత్తయ్య, కార్యదర్శి పొడియం రామకృష్ణ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామ సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు, పెసా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నీరుకొండ వీరన్న చౌదరికి చిరు సత్కారం..

- పి ఫోర్ టీం మరియు ఎమ్మెల్యే బత్తుల ఆధ్వర్యంలో ..



**కోరుకొండ, పెన్ పవర్, మార్చి 30:**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పి ఫోర్ పెట్టిన సందర్భంగా నీరుకొండ వీరన్న చౌదరికి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మరియు నియోజకవర్గ అధికారులు మండల మరియు పి ఫోర్ టీమ్ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరికి పి ఫోర్ స్ఫూర్తితో వెదుళ్ళపల్లి స్కూలుకి వారి కుటుంబ సభ్యులతో మండలంలో స్కూల్స్ కి భవన నిర్మాణము మరియు భోజనశాలకు,కాంపౌడ్,వాల్ కు సొంత నిధులు ఇచ్చినందుకు నీరుకొండ వీరన్న చౌదరికి చిరు సత్కారం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు వీరన్న చౌదరిని అభినందించారు.

## పశువుల సంత, రోజువారీ మార్కెట్ వేలంపాటలు నిర్వహణ



**చింతూరు పెన్ పవర్ మార్చి 30:**చట్టి గ్రామపంచాయతీలో సర్పంచ్ రవ్వ భద్రమ్మ అధ్యక్షతన వారాంతపు పశువుల సంత (మేకల సంత) మరియు రోజువారీ మార్కెట్ ఆసిల్‌కు సంబంధించిన బహిరంగ వేలంపాటలు సోమవారం నిర్వహించారు. వారాంతపు పశువుల సంత వేలంపాటలో గ్రామపంచాయతీ నిర్ణయించిన ప్రారంభ ధర రూ.60 వేలుగా ఉండగా, వేలంలో పాల్గొన్న వారి పోటీలో సంవత్సరానికి మొత్తం రూ.84,700కు చట్టి గ్రామానికి చెందిన రవ్వ వీరేంద్ర దక్కించుకున్నారు. అలాగే, గ్రామపంచాయతీ పరిధిలో రోజువారీ వ్యాపార నిమిత్తం వచ్చే వాహనాలపై మార్కెట్ ఆసిల్ వసూలు హక్కుల కోసం నిర్వహించిన వేలంపాటలో ప్రారంభ ధర రూ.20 వేలుగా నిర్ణయించారు. ఈ వేలంలో తుర్రం నీలయ్య సంవత్సరానికి రూ.50 వేల రూపాయలకు హక్కులను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు డిప్యూటీ ఎంపీడీవో ఆర్. వీర్రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ మహమ్మద్ అలీ, పెసా కమిటీ సభ్యులు తుర్రం చిన్న ముత్తయ్య, పొడియం రామకృష్ణతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.